

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 01-03-2025 | సంపుటి - 21 సంచిక - 310 రూ : 4 పేజీలు: 8



# బాహు'భళీ' బడ్జెట్!

- రూ.3,22,359 కోట్లతో రాష్ట్ర పద్దు
- ఏపీ చరిత్రలో ఇదే అత్యధికం
- విధ్వంసం నుంచి పునర్నిర్మాణమే లక్ష్యం
- సంక్షేమం, అభివృద్ధి సమతూకం
- ఎన్నికల హామీల అమలుకు పెద్దపీట

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించి, ఆర్థికంగా పరిపుష్టం చేయాలన్న ఘనమైన లక్ష్యాల సాధనకు పటిష్ఠమైన పునాదులు వేస్తూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడుతూ.. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో విధ్వంసం చేసిన వ్యవస్థలన్నింటినీ గాడిలో పెడుతూ.. 202526 సంవత్సరానికి రాష్ట్ర ఆర్థిక పద్దును ప్రభుత్వం ఆవిష్కరించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను రూ.3,22,359 కోట్లతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల కోట్ల మార్కును దాటడం ఇదే మొదటిసారి. రూ.48,341 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రవేశపెట్టారు. సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు సమప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు బడ్జెట్‌లో విస్తృత కసరత్తు చేశారు. వైకాపా ప్రభుత్వ అస్తవ్యస్త ఆర్థిక విధానాల వల్ల ఏర్పడిన సవాళ్లు, ఇబ్బందులు అడుగడుగునా అడ్డుతగులుతున్నా.. వాటిని అధిగమిస్తూ రాష్ట్ర పునర్నిర్మాణానికి బాటలు వేశారు. అసాధారణ రీతిలో రూ.40,635 కోట్ల మూల ధన వ్యయాన్ని ప్రతిపాదించారు. సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలు సమతూకంగా స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారం దిశగా అడుగులు వేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యమిచ్చారు.

'సంపద సృష్టించడం, ఆ ఫలాల్ని పేదలకు అందించడం ద్వారా వారి ఆర్థిక పరిపుష్టికి

తరువాయి 2లో

# సొరంగంలో జల్లెడ

- రాత్రింబవళ్లు కొనసాగుతున్న సహాయ చర్యలు
- తొలిసారి టీబీఎంను దాటి మొదలైన అన్వేషణ
- జీపీఆర్ పరికరంతో పలు అనుమానిత ప్రాంతాల గుర్తింపు
- ఆయాచోట్ల తవ్వుతున్న నిపుణులు

మహబూబ్‌నగర్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం ఎన్ఆర్ఎస్ఏ, ఎన్‌జీఆర్ఐ, జీఎస్ఐ బృందాలు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) పరికరంతో చేసిన అన్వేషణలో బురద లోపల ఆనవాళ్లు కనిపించినట్లు ప్రచారం జరిగినా... దీన్ని ఎవ్వరూ ధ్రువీకరించలేదు. లోపల ప్రక్రియ అంతా పూర్తి చేయడానికి మరికొన్ని రోజులు పట్టే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. అయితే, సొరంగం పైకప్పు కూలి వారం రోజులు గడుస్తోంది. అందులో చిక్కుకున్న ఎనిమిది మంది జాడ ఇప్పటికీ చిక్కలేదు. ప్రభుత్వం సహాయ చర్యల్లో రోజురోజుకూ వేగం పెంచుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత అన్వేషణ బృందాలు, సంస్థలు సొరంగం చెంతే క్యాంపులు పెట్టాయి. తాజాగా సింగరేణి సంస్థకు చెందిన మరిన్ని సహాయక బృందాలు రంగంలోకి దిగాయి.

**13.61 కి.మీ. దాటి ముందుకు...**

మొత్తం 13.85 కిలోమీటర్ల సొరంగంలో సహాయక బృందాలు శుక్రవారం 13.61 కిలోమీటర్లను దాటాయి.

తరువాయి 2లో



## జనాభా లెక్కన

# సీట్లు పెంచితే తిరుగుబాటే



- పునర్విభజనలో దక్షిణాదికి తీవ్ర అన్యాయం
- ఈ రాష్ట్రాలను నిర్వీర్యం చేయాలన్నదే భాజపా కుట్ర
- తెలంగాణ ప్రాజెక్టుల కోసమే దిల్లీ వెళ్తున్నాం
- మేం లిక్కర్ దందాలు చేయడం లేదు
- ప్రత్యేక విమానాల్లో దుబాయ్ వెళ్లలేదు
- పీసీసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను జనాభా లెక్కల ప్రాతిపదికన చేపట్టి.. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తే అది తీవ్ర సంక్షోభానికి, తిరుగుబాటుకు దారితీస్తుందని.. దాన్ని అంగీకరించే ప్రశ్నే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కుటుంబ నియంత్రణ విధానాలను పటిష్ఠంగా అమలు చేసినందున దక్షిణాది రాష్ట్రాల్లో

తరువాయి 2లో



## భక్తజన సంద్రం..

# శ్రీముఖలింగం

* వైభవంగా స్వామి చక్రతీర్థస్నానం

జలుమూరు, నరసన్నపేట, సారవకోట : శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలోని శ్రీముఖలింగేశ్వరుని క్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆఖరి ఘట్టమైన స్వామి చక్రతీర్థస్నానం వైభవంగా జరిగింది.

తరువాయి 2లో

## ఇంటర్ పరీక్షల్లో

# వాచీలను అనుమతించరు!

హైదరాబాద్: రాష్ట్రంలో మార్చి 5 నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఈసారి చేతి గడియారాన్ని నిషేధించారు. ఈ మేరకు విద్యార్థులు వాచ్ ధరించి వస్తే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. గత ఏడాది వరకు స్మార్ట్‌వాచ్‌ను మాత్రమే అనుమతించేవారు కాదు. విద్యార్థులు సాధారణ చేతి గడియారాలు ధరించే వీలుండేది. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం లేదు. అయితే ఏ పరికరంతో ఎలాంటి అక్రమాలకు పాల్పడతారోనన్న అనుమానాలు అధికారులను వెంటాడుతున్నాయి. ఈ మేరకు మరింత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని భావించి ఏ రకమైన చేతి గడియారాన్నీ అనుమతించరాదని నిర్ణయించినట్లు బోర్డు వర్గాలు తెలిపాయి.

తరువాయి 2లో



## ఏడాది చివరికల్లా మెగా ఎఫ్‌టీఏ

- భారత్, ఈయూ కీలక ప్రకటన
- ప్రధాని మోదీతో ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు లెయెన్ భేటీ

దిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఝుళిపిస్తున్న ప్రతీకార సుంకాల కొరడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర

తరువాయి 2లో





# కటకటాల్లోకి పోసాని..

**14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి**

కడప, రాజంపేట : నటుడు, వైకాపా నేత పోసాని కృష్ణమురళికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండు విధించారు. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి శుక్రవారం ఉదయం 5 గంటల వరకు ఇరుపక్షాల వాదనలు సుదీర్ఘంగా కొనసాగాయి. పోసాని తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డితో పాటు మరో 20 మంది న్యాయవాదులు హాజరయ్యారు. పోలీసుల తరఫు మరికొందరు

తరువాయి 2లో

# మంచుచరియల కింద 22 మంది



- ఇప్పటికే 33 మందిని రక్షించిన బలగాలు
- ఉత్తరాఖండ్‌లో ప్రమాదం

దేహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లో మంచుచరియల్ని తొలగించే పనులు నిర్వర్తిస్తున్న కార్మికుల్లో 55 మంది అనూహ్యంగా వాటికింద చిక్కుకుపోయారు. ఒక్కసారిగా పైనుంచి మంచుపెళ్లలు వారిపై పడిపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. సహాయక బృందాలు 33 మందిని రక్షించగలిగాయి. మిగిలిన 22 మంది ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బద్రీనాథ్ క్షేత్రానికి సమీపంలో ఛమోలీ జిల్లాలోని మనా గ్రామం వద్ద శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇది భారత్‌టిబెట్

తరువాయి 2లో

# బాహు'భళీ' బడ్జెట్!

(మొదటిపేజీ తరువాయి)

బాటలు వేయడం' కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఏటా నిలకడగా 15 శాతానికిపైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధించడం ద్వారా 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న బృహత్ లక్ష్యంతో స్వర్ణాంధ్ర2047 దార్శనిక పత్రాన్ని ప్రభుత్వం రూపొందించింది. దాన్ని చేరుకునేందుకు పది మార్గదర్శక సూత్రాల్ని రూపొందించింది. వాటి సాధనకు ఈ బడ్జెట్‌లో అనేక ప్రతిపాదనలు చేసింది. ఏకంగా రూ.40,635 కోట్ల మూలధన వ్యయాన్ని ప్రతిపాదించడం దానిలో భాగమే. ఇది అసాధారణ, సాహసోపేత చర్యగా కనిపిస్తున్నా.. అసాధ్యమైతే కాదు. తెదేపా ఎప్పుడు అధికారంలో ఉన్నా మూలధన వ్యయానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తుందని, ఖర్చు పెడుతుందని ట్రాక్ రికార్డు చూస్తే అర్థమవుతుంది. జీఎస్టీ విధానం వచ్చాక రాష్ట్ర ప్రభుత్వానికి వనరుల పరిధి తగ్గి, చాలా పరిమితులకు లోబడి ఆదాయం సమకూర్చుకోవాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మూలధన వ్యయం పెరిగితేనే ఆదాయం పెరుగుతుంది. దాన్ని దృష్టిలో ఉంచుకునే మూలధన వ్యయాన్ని గణనీయంగా పెంచింది. అభివృద్ధితో పాటు, స్వయం ఉపాధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్ని వినియోగించుకుంటూ పని సులభతరం చేయడం, మెరుగైన ఫలితాలు సాధించడంపై ఈ బడ్జెట్‌లో ఎక్కువ దృష్టి పెట్టారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో మూలనపడ్డవాటిని.. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరం గాడిలో పెట్టేందుకు ప్రయత్నించింది. ఈ బడ్జెట్‌లో మరింతగా పరిపుష్టం చేసేందుకు చర్యలు చేపట్టింది.

**విద్యారంగానికి అధిక కేటాయింపులు**

విద్యారంగంలో అనేక సంస్కరణలు, దిద్దుబాటు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం.. పాఠశాల, ఉన్నత విద్యకు కలిపి రూ.34,311 కోట్లు కేటాయించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఎంత మంది ఉంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న హామీకి కట్టుబడి ఉండటంతో భారీ మొత్తం కేటాయించాల్సి వచ్చింది. జలవనరులశాఖకు రూ.18,019 కోట్లు కేటాయించడం ద్వారా సాగునీటి ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం ప్రాధాన్యాంశమని నొక్కిచెప్పింది. 201419 మధ్య సాగునీటి ప్రాజెక్టులపై సుమారు రూ.60 వేల కోట్లు ఖర్చు చేసిన చరిత్ర తెదేపా ప్రభుత్వానిది. కాబట్టి రూ.18 వేల కోట్లు ఖర్చు పెట్టడం పెద్ద విషయమేమీ కాదు. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు రూ.6,705 కోట్లు, రాజధాని అమరావతికి రూ.6,000 కోట్లు ప్రతిపాదించారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులిస్తుంది. ప్రపంచబ్యాంకు, ఏడీబీ వంటి సంస్థలు అమరావతి నిర్మాణానికి రుణం ఇస్తున్నాయి కాబట్టి ఆ నిధులు ఖర్చు పెట్టడం కష్టమేమీ కాదు. అమరావతికి అంతకన్నా ఎక్కువే ఖర్చు పెట్టే అవకాశమూ ఉంది.

* **మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం**

జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన జలజీవన్ మిషన్‌ను కూటమి ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కించింది. ఇప్పటికే రూ.6,051 కోట్లతో టెండర్లు పిలిచిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనూ రూ.2,800 కోట్లు ప్రతిపాదించింది. వివిధ రంగాల్లో మౌలిక వసతుల ప్రాజెక్టులను పరుగులు పెట్టించేందుకు కొత్తగా వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టే ప్రాజెక్టులకు ప్రభుత్వం 20 శాతం వీజీఎఫ్‌గా ఇస్తుంది. దీనికి రూ.2 వేల కోట్లతో కార్పస్ ఫండ్‌ను బడ్జెట్‌లో ప్రతిపాదించింది. విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులకు రూ.50 కోట్లు ప్రతిపాదించింది. కేంద్ర బడ్జెట్‌లో మెట్రో ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే డీపీఆర్‌లు పంపించింది. ఈ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి భారీగా నిధులు తెచ్చుకునే అవకాశం ఉంది. వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఐటీ రంగాన్ని గాడిన పెట్టేందుకు చర్యలు చేపట్టింది. ఐటీ, ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ప్రోత్సాహకాల కోసం రూ.300 కోట్లు ప్రతిపాదించింది. రహదారుల నిర్మాణం, మరమ్మతులకు ప్రాధాన్యమిచ్చింది. జగన్ ప్రభుత్వం నగరపాలక సంస్థలు, పురపాలకసంఘాల్ని తన కబంధ హస్తాల్లో నలిపేసింది. ఒక్క రూపాయి ఖర్చు పెట్టాలన్నా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాల్సిందేనని నిబంధన పెట్టి వాటి స్వేచ్ఛను హరించింది. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించుకునే అధికారం వాటికే ఇచ్చింది.

# జనాభా లెక్కన సీట్లు పెంచితే తిరుగుబాటే

(మొదటిపేజీ తరువాయి)

జనాభా తగ్గిందని, సరిగా అమలు చేయని ఉత్తరాదిలో విపరీతంగా పెరిగిందని సీఎం తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలను ఆర్థికంగా, రాజకీయంగా నిర్వీర్యం చేయాలని భాజపా కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. గాంధీభవన్ ఆవరణలో శుక్రవారం జరిగిన పీసీసీ, మీడియా సమావేశాల్లో సీఎం మాట్లాడారు. "దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు సీట్లు తగ్గవని కేంద్రమంత్రి అమిత్‌షా అంటున్నారు. అంటే ఏమీ పెరగవని అర్థమే కదా? ఎన్ని సీట్లు ఏ ప్రాతిపదికన పెరుగుతాయో వెల్లడించాలి. 50 శాతం చొప్పున సీట్లు పెంచాలంటే తెలంగాణలో ఇప్పుడున్న 17 లోక్‌సభ స్థానాలకు 9 అదనంగా పెరగాలి. లేకపోతే 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలి. కేంద్ర పన్నుల్లో వాటా పరంగా రాష్ట్రాలకు న్యాయం జరగాలి.

* **కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డుపడుతున్నారు**

తెలంగాణ ప్రాజెక్టులు, నిధుల కోసం మేం ఎన్నిసార్లయినా దిల్లీ వెళతాం. మేం ఇతరుల మాదిరిగా ప్రత్యేక విమానాల్లో దుబాయ్‌కి, ఇతర దేశాలకు వెళ్లలేదు. దిల్లీ వెళ్లి లిక్కర్ దందాలు చేయడం లేదు. కేంద్రానికి తెలంగాణ నుంచి రూపాయి పన్ను కడితే 42 పైసలే వెనక్కి వస్తున్నాయి. అదే బిహార్‌కు రూ.7.06, యూపీకి రూ.3 ఇస్తున్నారు. కిషన్‌రెడ్డి అడ్డుపడటం వల్లే మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుకు అనుమతి రాకుండా ఆగింది. మూసీ ప్రక్షాళనకూ ఆయన సైంధవుడిలా అడ్డుపడుతున్నారు. మెట్రో విస్తరణకు డబ్బుందా అని కిషన్‌రెడ్డి అంటున్నారంటే.. దాన్ని కట్టవద్దనే కదా. బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీలో తీర్మానం చేస్తాం.. దానికి కేంద్రం వద్ద ఆమోదం పొందేలా కిషన్‌రెడ్డి చూడాలి. సెమీ కండక్టర్ పరిశ్రమ తెలంగాణకు కాకుండా గుజరాత్‌కు తీసుకెళ్లారు. ఇదే పరిశ్రమ పెట్టడానికి అస్సాంకు ప్రత్యేక రాయితీలు ఇచ్చారు. తెలంగాణకు ఎందుకివ్వలేదు? ఏ విషయంలోనూ కేంద్రం నుంచి రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా అదనంగా రాలేదు. రావాల్సినవి మాత్రమే వచ్చాయి.

* **ఒక్కరోజైనా మోదీని అడిగారా?**

కిషన్‌రెడ్డి ఒక్కరోజైనా ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్లి తెలంగాణకు ఏదైనా ప్రాజెక్టు కావాలని అడిగారా? తన చీకటి మిత్రుడు కేసీఆర్ అధికారం కోల్పోయారనే బాధతోనే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు. కిషన్‌రెడ్డి చిత్తశుద్ధి నిరూపించుకోవాలంటే ఈ ప్రాజెక్టులకు అనుమతి తీసుకున్న తరువాతే దిల్లీ నుంచి హైదరాబాద్‌కు రావాలి. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వమే ఉంది. అక్కడ మైనార్టీలకున్న బీసీ రిజర్వేషన్లను కిషన్‌రెడ్డి రద్దు చేయిస్తారా? కృష్ణ మాదిగను కౌగిలించుకుని ఎన్నికల్లో బాగా వినియోగించుకున్నారు. మీ ప్రభుత్వమే అధికారంలో ఉన్న ఏపీలో ఎందుకు ఎస్సీ వర్గీకరణ చేయడం లేదు? మీకు చిత్తశుద్ధి ఉంటే ఏపీ సీఎం చంద్రబాబును డిమాండు చేసి ఎస్సీ వర్గీకరణ చేయమనండి. మైనార్టీలకున్న బీసీ రిజర్వేషన్లు రద్దు చేయమనండి. కేవలం భావోద్వేగాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడమే లక్ష్యంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారు.

* **పార్టీ జెండా మోసిన వారికి గుర్తింపు**

కార్యకర్తల కష్టాలు తెలిసిన నాయకురాలు మీనాక్షి నటరాజన్. పార్టీ జెండా మోసిన వారికి ఆమె రాకతో మంచి రోజులు రాబోతున్నాయి. పార్టీ కోసం సుదీర్ఘకాలం కష్టపడి పనిచేసినా.. కొంతమందికి అవకాశాలు రాలేదు. రాబోయే రోజుల్లో వారికి తప్పకుండా ప్రాధాన్యమిస్తాం. ఖాళీగా ఉన్న కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీకి అర్హులైన వారి పేర్లతో మార్చి 10లోగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు ప్రతిపాదనలు పంపాలి. మంచిని మైక్‌లో చెప్పండి.. చెడును చెవిలో చెప్పాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. రాహుల్ గాంధీని ప్రధానిని చేసే వరకు కసితో పనిచేయాలి. త్వరలో కార్యాచరణ తీసుకుని పార్టీని మరింత బలోపేతం చేస్తాం" అని రేవంత్‌రెడ్డి వివరించారు.

# ఏడాది చివరికల్లా మెగా ఎఫ్‌టీఏ

(మొదటిపేజీ తరువాయి)

ప్రతికూల ప్రభావం చూపే ముప్పుందంటూ ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ భారత్, ఐరోపా యూనియన్ (ఈయూ) కమిషన్ కీలక ప్రకటన చేశాయి. తమ మధ్య దీర్ఘకాలంగా చర్చల్లో నానుతున్న మెగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) ఈ ఏడాది చివరికల్లా పట్టాలెక్కించనున్నట్లు ప్రకటించాయి. ఈ మేరకు సంప్రతింపులను వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపాయి. రక్షణ, భద్రత, సాంకేతికత సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక బంధాన్ని మరింత విస్తరించుకోవాలని కూడా భారత్, ఈయూ నిర్ణయించాయి. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్ దిల్లీలో ప్రధాని మోదీతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈయూ, దిల్లీ మధ్య సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. తమ సన్నిహిత మిత్ర దేశాలైన జపాన్, దక్షిణ కొరియాలతో కుదుర్చుకున్న తరహాలో భారత్‌తోనూ భద్రత, రక్షణ ఒప్పందాలను బలోపేతం చేసుకోవాలని భావిస్తున్నట్లు లెయెన్ తెలిపారు. 2025 తర్వాత ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మార్గదర్శనం చేసే రోడ్‌మ్యాప్‌ను ఇప్పటికే సిద్ధం చేశామని, ఈ ఏడాది భారత్‌ఈయూ శిఖరాగ్ర సదస్సులో దాన్ని ఆవిష్కరిస్తామని మోదీ పేర్కొన్నారు.

* **పెట్టుబడుల పరిరక్షణ ఒప్పందం కుదుర్చుకుంటాం: మోదీ**

ద్వైపాక్షిక పెట్టుబడులను పెంచుకునేందుకు భారత్, ఈయూ కృషి చేస్తున్నట్లు మోదీ తెలిపారు. ఇందులో భాగంగా పెట్టుబడుల పరిరక్షణ ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు. వాణిజ్యం, సాంకేతికత, నవకల్పనలు, హరిత వృద్ధి, నైపుణ్యాలవంటి రంగాల్లో సహకారం కోసం బ్లూప్రింట్‌ను సిద్ధం చేశామన్నారు. పరస్పర ప్రయోజనకరమైన మెగా ఎఫ్‌టీఏ చర్చలను ఈ ఏడాది చివరికల్లా పూర్తిచేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు మోదీ వెల్లడించారు.

ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతల పరిరక్షణకు భారత్, ఈయూ కట్టుబడి ఉన్నాయని చెప్పారు. భారత్‌పశ్చిమాసియాఐరోపా ఆర్థిక నడవా (ఐఎంఈఈసీ) ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు నేల, నీరుతోపాటు అంతరిక్షంలోనూ ఇరుపక్షాలూ భద్రత, రక్షణ భాగస్వామ్యాన్ని పటిష్ఠం చేసుకునేందుకు ఇదే సరైన తరుణమని లెయెన్ వ్యాఖ్యానించారు. ద్వైపాక్షిక వ్యూహాత్మక సంబంధాలను భారత్, ఈయూ తర్వాతి దశకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతను ఆమె స్థానికంగా మరో కార్యక్రమాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో నొక్కిచెప్పారు.

**17 ఏళ్ల కిందట మొదలై..**

భారత్, ఈయూ మధ్య మెగా ఎఫ్‌టీఏ కుదిరితే.. అది ప్రపంచంలోకెల్లా అతిపెద్ద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో ఒకటిగా నిలుస్తుంది. దాదాపు 17 ఏళ్ల క్రితమే ఈ ఒప్పందం కోసం ఇరు పక్షాలూ చర్చలు ప్రారంభించాయి. పలు అంశాల్లో భిన్నాభిప్రాయాల కారణంగా 2013లో సంప్రతింపులు నిలిచిపోయాయి. 2022 జూన్‌లో వాటిని తిరిగి ప్రారంభించారు. కార్లు, వైన్, వ్యవసాయోత్పత్తులపై సుంకాలు తగ్గించాలంటూ దిల్లీని ఈయూ తీవ్రంగా డిమాండ్ చేయడంతో తర్వాత కూడా చర్చలు వేగంగా సాగలేదు.

# జగన్ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండండి



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టనున్నారు. పాంచారాత్రాగమ విధానాలతో 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకంగా సాంస్కృతికోత్సవాలకు రూపకల్పన చేశామని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 7న రాత్రి ఎదుర్కోలు వేడుక, 8న రాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, 9న రాత్రి దివ్యవిమాన రథోత్సవం నిర్వహిస్తారు. 11న గర్భాలయంలోని మూలవరులకు నిర్వహించే సహస్ర ఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి. శనివారం నుంచి ఈ నెల 11 వరకు స్వామివారి నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహణ ఉండదని ఈవో వెల్లడించారు.

# సొరంగంలో జల్లెడ

(మొదటిపేజీ తరువాయి)

శిథిలమైన టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం)ను దాటి లోనికి వెళ్లాయి. లోపల 9.2 మీటర్ల వెడల్పుతో ఉన్న టన్నెల్‌లో ఐదున్నర అడుగుల ఎత్తులో బురద, మట్టి పేరుకున్నట్లు గుర్తించారు. ఒకవైపు టీబీఎం భాగాలను కట్టర్లతో కోస్తూనే మరోవైపు పైపులు, ఇనుప సామగ్రిని వెలుపలకు తరలిస్తున్నారు. శనివారం నాటికి యంత్రం కటింగ్ సగానికిపైగా పూర్తవుతుందని చెబుతున్నారు.

**జీపీఆర్ పరికరంతో స్కానింగ్**

టన్నెల్ లోపల ఘటన స్థలంలో జీపీఆర్ పరికరం సాయంతో ఎన్‌జీఆర్‌ఐ నిపుణులు స్కానింగ్ చేశారు. ఈ పరికరం రేడియో తరంగాల ద్వారా భూగర్భంలోని వస్తువులు, అవశేషాలు, ఇతర పదార్థాలను గుర్తిస్తుంది. టీబీఎం, ఇతర పరిసరాల్లో కొన్ని అనుమానిత ప్రాంతాలను గుర్తించారు. ఆయా చోట్ల తవ్వకాలు చేపడుతున్నారు. జీపీఆర్ పరికరంతోపాటు ఆక్వాఐ పరికరంతోనూ స్కానింగ్ చేస్తున్నారు.

**అడుగడుగునా అడ్డొస్తున్న ఊట**

సొరంగం చివర్లో కట్టర్ ఉన్న ప్రాంతం నుంచి భారీగా నీటి ఊట వస్తుండటం సహాయక చర్యలకు విఘాతంగా మారుతోంది. పంపులతో ఎంత తోడుతున్నా... చివరి భాగం నుంచి వస్తున్న ఊటలు ప్రతిబంధకంగా ఉన్నట్లు చెబుతున్నారు. టీబీఎం కింది భాగంలో ఉన్న మట్టిని తొలగిస్తున్న కొద్దీ నీరు ఊరుతోంది. అయినా, వెరవకుండా బురదను సిబ్బంది తోడుతూనే ఉన్నారు.

**మూడు షిఫ్టుల్లో అలుపెరుగని శ్రమ**

సహాయ చర్యలు రెండు రోజులుగా ఊపందుకున్నాయి. సహాయ బృందాల సభ్యులు మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు శ్రమిస్తున్నారు. మట్టి, బురదను తొలగించడం, టీబీఎం శిథిలాలను ప్లాస్మా, గ్యాస్ కటింగ్ యంత్రాలతో కోయడం, భారీ మోటార్లతో నీటిని తోడేయడం, పైపులు, ఇతర సామగ్రిని 300 మీటర్ల దూరం వరకు మోసుకురావడం, లోకో రైలు వ్యాగన్లలో వాటిని నింపడం... అక్కడి నుంచి బయటకు పంపించడం తదితర పనులను కాలంతోపోటీ పడుతూ కొనసాగిస్తున్నారు.

# కటకటాల్లోకి పోసాని.. 14 రోజుల రిమాండ్ విధించిన న్యాయమూర్తి

(మొదటిపేజీ తరువాయి)

న్యాయవాదులు పాల్గొన్నారు. ఇరుపక్షాల సుదీర్ఘ వాదనల అనంతరం ఉదయం 6 గంటలకు రిమాండు విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. బీఎన్‌ఎస్ యాక్ట్ ప్రకారం పోసానికి 41ఏ నోటీసులు ఇచ్చి బెయిల్ ఇవ్వాలని పొన్నవోలు కోరారు. కాదు, రిమాండు విధించాల్సిందేనని పోలీసుల తరఫు న్యాయవాదులు గట్టిగా వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న మేజిస్ట్రేట్ మార్చి 12 వరకు రిమాండు విధించడంతో పోసానిని రాజంపేట ఉపకారాగారానికి తరలించారు.

**ఖైదీ నంబరు 2261**

జైలు అధికారులు పోసానికి ఖైదీ నంబరు 2261 కేటాయించారు. రెండు రాత్రులు, ఒక పగలు విరామం లేకుండా ప్రయాణం, విచారణ కారణంగా జైల్లోకి ప్రవేశించే సమయంలో ఆయన నీరసంగా కనిపించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయన ఆరోగ్యంగానే ఉన్నట్లు తెలిపారు. రాజంపేట ఉప కారాగారం అధికారి మల్‌రెడ్డి, ఓబులవారిపల్లి పోలీసుల సమక్షంలో పోసానికి గదిని కేటాయించారు. జైళ్ల శాఖ డీఎస్పీ హుస్సేన్‌రెడ్డి అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇక్కడ 25 మంది ఖైదీలున్నారని, ఎలాంటి ఇబ్బందులు లేవని, పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉందని తెలిపారు.

# భక్తజన సంద్రం.. శ్రీముఖలింగం

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను అర్చకులు ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుడి నుంచి దక్షిణదిశగా ఊరేగింపుగా స్వామిని వంశధార నదీ తీరానికి తీసుకెళ్లారు. అత్యంత భారీ సంఖ్యలో హాజరైన భక్తజనం సందడి మధ్య స్వామి చక్రతీర్థస్నానం నిర్వహించారు. కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి సుమారు 1.5 లక్షల మంది హాజరైనట్లు దేవాదాయ శాఖాధికారులు పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్షల్లో వాచీలను అనుమతించరు!

(మొదటిపేజీ తరువాయి)

మరోవైపు ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులను పూర్తిగా తనిఖీచేసిన తర్వాతే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని సీఎస్ శాంతికుమారి శుక్రవారం అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సమయాన్ని గుర్తు చేసేలా అర గంటకు ఒకసారి బెల్ మోగుతుంది. వెంటనే ఇన్విజిలేటర్లు కూడా ఆ విషయాన్ని చెప్పేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇంటర్ పరీక్షల్లో సాధారణ వాచీలను కూడా నిషేధించడంపై విమర్శలు వస్తున్నాయి. పలువురు విద్యార్థులు చేతి గడియారాన్ని బెంచీపై పెట్టుకొని రాస్తుంటారని, ఒక్కో ప్రశ్నకు, విభాగానికి ఎంత సమయం కేటాయిస్తున్నామో చూస్తూ.. అంచనా వేసుకుంటారని సీనియర్ అధ్యాపకుడు ఒకరు చెప్పారు.

# మంచుచరియల కింద 22 మంది

(మొదటిపేజీ తరువాయి)

సరిహద్దులో మన దేశానికి చెందిన చివరి గ్రామం. జాతీయ రహదారిపై భారీగా పేరుకుపోయిన మంచుమేటలను సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్‌ఓ) సిబ్బంది తొలగిస్తున్నప్పుడు దుర్ఘటన జరిగింది. ఈ ప్రదేశం సముద్ర మట్టానికి 3,200 మీటర్ల ఎత్తులో ఉంది. మంచుతో కూడిన వర్షం దట్టంగా కురుస్తుండటం, చీకటి పడిపోవడం వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఘటనా స్థలికి జాతీయ, రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళాలు (ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్) చేరుకొని సహాయ కార్యక్రమాల్లో మునిగిపోయాయి. కాపాడినవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమీక్షించి కొన్ని సూచనలు చేశారు.

* **ఆలస్యమయ్యే కొద్దీ ఇబ్బందే**

ఏటా శీతాకాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడటం సాధారణంగా మారింది. ఈ చరియలు 5 సెకన్ల కాలంలోనే గంటకు 80 మైళ్ల వేగాన్ని పుంజుకుంటుంటాయి. ఇలాంటి ఘటనల్లో 2.3 లక్షల ఘనపు మీటర్ల వరకూ మంచు విడుదలవుతూ ఉంటుంది. అంటే 20 ఫుట్‌బాల్ మైదానాల్లో 3 మీటర్ల మందం వరకూ కప్పిన హిమంతో సమానమన్నమాట. ఈ హిమ శకలాల్లో చిక్కుకున్న వ్యక్తిని 18 నిమిషాల్లోగా కాపాడగలిగితే బతికిబట్టగట్టేందుకు 91 శాతం అవకాశాలు ఉంటాయి. 35 నిమిషాలు దాటితే బతికే అవకాశాలు 34 శాతానికి పడిపోతాయి.

# టీయూడబ్ల్యూజే ఐజేయూ సభ్యత్వ నమోదు ప్రారంభం

* **త్వరలో జిల్లా మహాసభలు.**



రంగారెడ్డి జిల్లా. (ప్రజాస్ఫూర్తి) : రంగారెడ్డి జిల్లాలో టీయూడబ్ల్యూజే ఐజేయూ బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. తొర్రుర్ లోని శ్రీరస్థు బ్యాంకెట్ హాల్ లో శుక్రవారం జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 3 వ తేదీ వరకు జిల్లాలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన తర్వాత జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ మహాసభల సందర్భంగా జిల్లాలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయా నియోజకవర్గాలకు జిల్లా కమిటీ బాధ్యులు, ఆయా ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు ఇంచార్జ్ లుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. జిల్లా బాధ్యులు సమిష్టిగా కృషి చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యునియాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మాఫీసిల్ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్, జాతీయ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీమ్ పాషా, సత్యనారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు కటకం సుభాష్, కార్యదర్శులు,కోశాధికారి సంరెడ్డి శశిపాల్ రెడ్డి, రాజేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులు బానిసలు కాదు

* **ఏ ఏ ఎస్ ఇన్చార్జ్ బోడికల ప్రేమ్ దయాళ్**
* **చికిత్స పొందుతున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించాలి.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:మణుగూరు ఏరియాలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ గా గత 8 సంవత్సరాలుగా పని చేస్తున్న విరబాబు అనే సెక్యూరిటీ గార్డ్ పై కక్ష సాధింపులో భాగంగా ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వేధింపులకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఆజాద్ అధికార్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్చార్జి బోడికల ప్రేమ్ దయాళ్ జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతూన్న సెక్యూరిటీ గార్డ్ విరబాబు ను కలిసి పరామర్శించి జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..18 నెలల క్రితం అనారోగ్య సమస్యల కారణంగా శస్త్రచికిత్స పొంది ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో నిత్యం బరువైన వస్తువులను మోపియడం ద్వారా శస్త్ర చికిత్స చేసిన భాగంలో అంతర్గత బ్లీడింగ్ జరిగి తీవ్ర ఆవేదన చేందుతున్నడని విచారం వ్యక్తం చేశారు. నిత్యం ఏదో ఒక ఏరియాలో కాంట్రాక్ట్ ఉద్యోగులపై అధికారులు వేధింపులకు పాల్పడడం సర్వసాధారణంగా మారిందని అన్నారు. ఇక నైన అధికారులు తమ తీరు మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యను అందిస్తే మంచి ఫలితాలు సాధిస్తారు

* **మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులకు ప్రయోగాత్మకంగా విద్యను అందిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మూసాపేట్ పంచశీల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ హజరై చిన్నారులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ వైజ్ఞానిక రంగంలో సర్ సి.వి రామన్ చేసిన పరిశోధనలకు గుర్తింపుగా ప్రతి సంవత్సరం వారి జయంతి ని జాతీయ వైజ్ఞానిక దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు.వైజ్ఞానికప్రదర్శనలుఏర్పాటుచేయడంవల్ల విద్యార్థులకు సైన్స్ రంగం పట్ల ఆసక్తి కలిగేలా చేసి, వైజ్ఞానిక రంగంలో కొత్త ప్రయోగాలు చేసేలా ఆసక్తిని నెలకొల్పుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్,పంచశీల స్కూల్స్ అధినేత డి. శ్రీనివాస్,అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓయూ వైస్ చాన్సలర్ ప్రొ. కుమార్ మొలుగారంకు

# సర్ సివి రామన్ ఎక్సలేన్సి అవార్డు ప్రధానం



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : ఆధునిక భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సి.వి.రామన్ అని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మోలుగరం అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ విసి రెసిడెన్స్ ఛాంబర్ లో తెలంగాణ మేధావుల పురం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బర్కత్ పుర ఆఫీసులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. నా మతం సైన్స్ దానిని జీవితాంతం ఆదరిస్తా అని చెప్పి తుది శ్వాస వరకు శాస్త్రాన్వేషణలోనే గడిపిన దర్శనీకుడు శాస్త్రవేత్త ప్రొఫెసర్ సివి రామన్ అని అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ప్రసంగిస్తూ భారతదేశంలో పుట్టి ప్రయోగాలు చేసి నోబుల్ బహుమతి అందుకున్న మొదటి శాస్త్రజ్ఞుడు, భారతరత్న మొదటి బిరుదును అందుకున్న ప్రొఫెసర్ సివి రామన్ ఆదర్శాలు నేటి నేటి విద్యార్థులు ,ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకొని సైన్స్ రంగంలో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రముఖ ఇంజనీర్ శ్రీ పడిగా ఉజ్వల్ చందర్ మాట్లాడుతూ 1928లో ఫిబ్రవరి 28న సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సివి రామన్ ఎఫెక్ట్ ను కనుగొన్నారని దరిమిలా ఆ రోజు రామన్ సంస్మరణార్థం జాతీయ విజ్ఞాన దినోత్సవం మనమందరం జరుపుకుంటామని అన్నారు . ఈ సందర్భంగా తెలంగాణ మేధావుల పురం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ శాలువా, పూలమాల, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో ఓయూ వైస్ ఛాన్సలర్ కుమార్ ను సర్ సివి రామన్ ఎక్సలేన్సీ అవార్డు 2025 అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ డైరెక్టర్ లైన్ ప్రేమ్ చాంద్ మునోత్ జైన్, సంస్థ కార్యదర్శి డాక్టర్ అక్తర్ అలీ ,ప్రోగ్రాం అడ్వైజర్ డాక్టర్ రవితేజ ,విద్యావేత్త ఇట్టా ఉదయశ్రీ లు ఓయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మోలుగారం కు శాలువా పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

* **ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత చదువుతోపాటు క్రీడల్లోను రాణిస్తూ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.దుమ్ముగూడెం పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నుండి ములకపాడు క్రీడా మైదానంలో ప్రారంభమైన మండల స్థాయి వాలీబాల్ పోటీలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తో పాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ పరితోష్ పంకజ్ ,ఏఎస్పీ భద్రాచలం విక్రాంత్ సింగ్ లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. నాలుగు రోజులు పాటు జరగనున్న ఈ మండల స్థాయి వాలీబాల్ పోటీలలో 54 టీమ్ లు పాల్గొననున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలోని ఏజెన్సీ ప్రాంత యువత కోసమే సుమారుగా రెండు కోట్ల రూపాయల వ్యయంతో పోలీసుల ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.త్వరలోనే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించనున్నామని తెలియజేశారు. దుమ్ముగూడెం మండలం నుండి యువత క్రీడల్లో జాతీయస్థాయి వరకు చేరుకొని ఈ ప్రాంతానికి,జిల్లాకి,రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆశించారు.జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల అభివృద్ధి, సంక్షేమమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలియజేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసు శాఖ తరపున వివిధ రకాల కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. యువత దురలవాట్లకు దూరంగా ఉంటూ మంచిగా చదువుకొని తమ తల్లిదండ్రులకు ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఇటీవల అండర్ 19 మహిళల క్రికెట్ వరల్డ్ కప్ లో అత్యద్భుత ప్రతిభ కనబరిచి ఇండియా కప్ ను సాధించడంలో కీలక పాత్ర పోషించిన గొంగిడి త్రిష కూడా మన జిల్లా ఏజెన్సీ ప్రాంత వాసి కావడం ఎంతో గర్వకారణం అని తెలిపారు. క్రీడాకారులందరూ అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రజలందరూ సైబర్ నేరాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అనంతరం పోక్సో కేసులలోని నిందితులకు ప్రస్తుత చట్టాలప్రకారం ఏ విధమైన శిక్షలు అమలు అవుతున్నాయో వివరించారు.ఈ వాలీబాల్ మండల స్థాయి టోర్నమెంటును అద్భుతంగా ఏర్పాటు చేసిన దుమ్ముగూడెం పోలీసులను మరియు భద్రాచలం ఏఎస్పీ ని అభినందించారు.ఈ కార్యక్రమంలో 141వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్,దుమ్ముగూడెం సిఐ అశోక్,ఎస్సైలు వెంకటప్పయ్య,గణేష్ లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీస్తే సమాజం గర్వించే స్థాయికి ఎదుగుతారు

* **జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్**














జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులలొ దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తే సమాజం గర్వించే స్థాయికి ఎదుగుతారని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో నిర్వహించిన ఇగ్నైట్ మల్టీ లీగుల్ అండ్ సైన్స్ ఎక్స్ పో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు నమునాలను ఆయన తిలకించి అభినందించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే మెదడుకు పదును పెడితే భావితరాలు గర్వించే నిపుణులౌతారన్నారు. విద్యార్థులు విద్యతోపాటు, క్రీడలు,శాస్త్రసాంకేతిక రంగాలలో రాణించి మన ప్రాంత,జిల్లా,రాష్ట్ర,దేశ ప్రతిష్టను ఇనుమడింప చేయాలని విద్యార్థులను ఆకాంక్షించారు. వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ సి.హెచ్.నర్సింహులు గౌడ్ మాట్లాడుతూ అనుభజ్ఞులైన అధ్యాపక బృందంచే ప్రతి విద్యార్థిపై వ్యక్తి గత శ్రద్ధతో విద్యతో పాటు సంస్కృతి, సంప్రాదాయాలు, సామాజిక విలువల గురించి తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సాయిబాబా, పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, స్థానిక నాయకులు. మల్లేష్ గౌడ్, సంజయ్ పురి కాలనీ అధ్యక్షులు అరుణ్ రెడ్డి, నాయకులు అప్పల శ్రీను, హనుమంతు, సునీల్ రెడ్డి,ప్రవీణ్, షౌకత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిత్య జీవితంతో ముడిపడున్న సైన్స్

- **ప్రధానోపాధ్యాయుడు అంబటి రవీందర్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: నిత్య జీవితంతో సైన్స్ ఎంతో ముడిపడుందని ముస్తాబాద్ జడ్పిహెచ్ఎస్ బాలికల ప్రధానోపాధ్యాయుడు అంబటి రవీందర్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అంబటి రవీందర్ మాట్లాడుతూ ప్రతి రోజూ మన జీవితంలో సైన్స్ యొక్క ఉపయోగాలను అధ్యయనం చేస్తూ సైన్స్ అభివృద్ధికి మరింత తోడ్పడాలని అన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానపిపాసను పెంచేందుకు, సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో మరింత విజ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులు జ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రయోగాత్మక విధానం ఎంతో అవసరం అన్నారు. కష్టపడి చదువుకొని విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలుగా ఎదిగి, దేశానికి సేవలందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శ్రీమతి, లక్ష్మణ్, జ్యోతి, రాణి, జ్యోత్స్న, గోవర్ధన్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్ తదితరులున్నారు.

# శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

**: కే సరోజమ్మ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థి దశ నుంచి విద్యార్థినిలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ కే సరోజమ్మ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థినిలు పలు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కే సరోజమ్మ మాట్లాడుతూ దేశ శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి దోహదపడేలా కృషి చేయాలని విద్యార్థినీలకు సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన క్విజ్ చిత్రలేఖనం వ్యాసరచన ఉపన్యాస పోటీలలో విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన కూలీలైన్ ప్రధాన ఉపాధ్యాయుడు

* లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్ గా పట్టుబడిన ప్రధానోపాధ్యాయుడు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణం కూలీ లైన్ హైస్కూల్లో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు రవీందర్ రూ.20 వేలు లంచం తీసుకుంటు రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపారు. కరాటే శిక్షణకు పాఠశాలకు రూ.30 వేలు మంజూరయ్యాయి. ఇన్స్ట్రక్చర్కు ఇవ్వాల్సిన రూ.30 వేలల్లో రూ.20 వేలు లంచం డిమాండ్ చేయగా, బాధితుడి ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు.

# చౌటుప్పల్ లో ఘనంగా టైలర్స్ డే




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం టైలర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మార సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి గుంటి వెంకటేశ్వర్లు, ఆదిమూలం శంకర్, కొంగరి కనకయ్య, రాపోలు పరమేష్, వనమాల దశరథ, బడుగు కృష్ణ, సూర భూమేష్, కొయ్యడ నరసింహ, కొక్కు సోమేశ్, సిలువేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ట్రినిటీలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం

- ఆకట్టుకున్న విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ట్రినిటీ పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉజ్జిని మంజుల మాట్లాడుతూ భారతదేశంలో సైన్స్ విభాగంలో మొట్టమొదట నోబెల్ బహుమతి అందుకున్న వ్యక్తి సివి రామన్ అని కొనియాడారు. వైజ్ఞానిక విభాగంలో చేసిన కృషికి గాను భారతదేశ అత్యున్నత పురస్కారం భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు సివి రామన్ అందుకున్నారని గుర్తు చేశారు. ఆయన పేరు మీదే ఫిబ్రవరి 28తేదీని జాతీయ వైజ్ఞానిక దినోత్సవంగా ప్రకటించిందన్నారు. అనంతరం విద్యార్థులు సైన్స్ విభాగంలో వివిధ ప్రయోగాలు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కృష్ణారావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# రాజాపేట, రఘునాథపురం గ్రామాల్లో అమావాస్య అన్న ప్రసాద వితరణ



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : అమావాస్య సందర్భంగా రాజాపేట మండలం రఘునాథపురం రాజాపేట గ్రామాలలో శుక్రవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పెద్దల జ్ఞాపకార్థం రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం వద్ద, రఘునాథపురం గ్రామంలోని ఆర్యవైశ్య సంఘ భవనం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజపేట కు చెందిన పుల్లూరు అనంతలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ పుల్లూరు ఉపేందర్ అన్నదాన కార్యక్రమానికి బియ్యం దాతగా అందజేసారు. ఈ సందర్భంగా పుల్లూరు ఉపేందర్ కు పలువురు కృతజ్ఞతలు చెప్పారు. నంగునూరు రాజు, బెజుగం చంద్రశేఖర్, బుడమ సత్యనారాయణ, బెజుగం శ్రీనివాసులు, ఉప్పల శ్రీనివాసులు, మార్త జగదీశ్వర్, గంగిశెట్టి రాజు, పెద్ది సంతోష్, పుల్లూరు శ్రీనివాసులు, నాళ్ల శేఖర్, ఇమ్మడి నర్సింలు, ఉప్పల రమేష్,మార్త సంతోష్, పారుపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రఘునాథపురం పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పల సిద్ధి లింగం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. గ్రామంలోని ఆర్యవైశ్యులు కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదన్న వడ్డన చేశారు.

## జర్నలిస్టుల హక్కుల సాధన కోసం

# ఉద్యమానికి సిద్ధం కావాలి...

* గుండగోని జయశంకర్ గౌడ్ జిల్లా అధ్యక్షులు టీయూడబ్ల్యూజే హెచ్ -143




ప్రజా స్ఫూర్తి నల్లగొండ : జర్నలిస్టులకు ప్రయోజనం చేకూర్చే అక్రిడేషన్ కార్డుల జారీలో కోతలు విధించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అవసరమైతే రోడ్డు ఎక్కి అయినా జర్నలిస్టుల హక్కులకు భంగం కలగకుండా ప్రత్యక్ష పోరాటాలకు టి యు డబ్ల్యూ జే హెచ్ 143 యూనియన్ ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధంగా ఉంటుందని సంఘం జిల్లా అధ్యక్షులు గుండగోని శంకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మునుగోడు నియోజకవర్గం జర్నలిస్టుల విస్తృతస్థాయి సమావేశం టీయూడబ్ల్యూజే హెచ్ 143 ఆధ్వర్యంలో గట్టుప్పల్ లోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. టీయూడబ్ల్యూజే ట్రేడ్ యూనియన్ కార్మిక సంఘం ఏ ఒక్క పార్టీకి వ్యతిరేకం, అనుకూలం కాదని, ఏ ప్రభుత్వం ఉన్నా జర్నలిస్టుల హక్కులకు భంగం కలగకుండా, వారి సంక్షేమం కోసం మాత్రమే పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. తెలంగాణలో 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న ప్రభుత్వంతో జర్నలిస్టులకు అవసరమైన అనేక హక్కులను సాధించుకోవడం జరిగిందని, జర్నలిస్టుల సంక్షేమం కోసం నిధిని సమకూర్చుకొని కరోనా సమయంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలిచి ఒక్కొక్క కుటుంబానికి రెండు లక్షల రూపాయలు సహాయం అందించడంతోపాటు, వారి పిల్లల విద్యాభివృద్ధి కోసం కృషి చేయడం జరిగిందని,, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులందరికీ అండగా నిలిచిన చరిత్ర టీయూడబ్ల్యూజే హెచ్ 143కి దక్కుతుందని గుండగోని జయశంకర్ గౌడ్ అన్నారు. జర్నలిస్టుల యూనియన్ ను పటిష్టవంతం చేయడానికి మండల స్థాయి నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తే వారం రోజుల్లోగా సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి యూనియన్ గుర్తింపు కార్డులు జారీ చేస్తామని తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలోని చండూరు, నాంపల్లి, మరి గూడెం, గట్టుప్పల్, మునుగోడు, మండల కమిటీలను నూతన కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సభ్యత్వం ఉన్నవారికి మాత్రమే కమిటీలలో చోటు కల్పించాలని గుండగోని జయశంకర్ గౌడ్ అన్నారు. జర్నలిస్టుల విస్తృతస్థాయి సమావేశానికి ఐజేయు జాతీయ కౌన్సిల్ మెంబర్ అవార్ భాస్కర్ కార్యక్రమానికి హాజరై జర్నలిస్టులను ఉద్దేశించి మాట్లాడారు. సీనియర్ జర్నలిస్ట్ గాలెంక గురుపాదం మాట్లాడుతూ జర్నలిస్టులకు పైసా ఆదాయం లేకున్నా ఈర్ష స్వభావంతో కలిసికట్టుగా ఉండడం లేదని, ఐక్యత లోపిస్తే జర్నలిస్టుల ఉనికి ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు. టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు పోలగోని లక్ష్మీకాంత్ గౌడ్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి అందరి మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే 143 నూతన కమిటీకి అధ్యక్షులుగా బొడ్డుపల్లి సతీష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కోడి రాములు ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా కామిశెట్టి యాదయ్యను ఎన్నుకున్నారు. త్వరలో పూర్తిస్థాయి కమిటీని ప్రకటిస్తామని నూతన అధ్యక్ష కార్యదర్శులు బొడ్డుపల్లి సతీష్, కోడి రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఎం గాలయ్య, శ్రీశైలం, రామస్వామి, జి వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వృత్తి నైపుణ్య శిక్షణ తో ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం పాల్వంచలోని నవ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పూర్తి చేసుకున్న ఐటిఐ విద్యార్థుల కు ధ్రువీకరణ పత్రాలు అందజేయు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శిక్షణ కేంద్రంలోని అన్ని తరగతి గదులను పరిశీలించి శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ ఎలా ఉంది, ఏ కోర్స్ శిక్షణ తీసుకుంటున్నారు అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కేంద్రంలో ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వృత్తి విద్యలో శిక్షణ పొందిన విద్యార్థులు పరిశ్రమల స్థాపన ద్వారా పారిశ్రామిక వేత్తలుగా ఎదగొచ్చని ఆయన అన్నారు. పదవ తరగతి తర్వాత ఐదు సంవత్సరాల పాటు విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు అని, అలాంటి వారికి తక్షణ ఉపాధి కల్పించే వృత్తి విద్యా కోర్సులు ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు. ఇది వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందన్నారు. ప్రపంచంలో పెరుగుతున్న సరాలకు అనుగుణంగా సాంకేతిక సిబ్బంది డిమాండ్ బాగా ఉందని, విద్యార్థులు వృత్తి విద్య కోర్సులు మరియు శిక్షణ పూర్తి చేయడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చు అని కలెక్టర్ తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి అయిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, నవ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, శిక్షణ కేంద్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్యదర్శి పై చేసిన ఫిర్యాదు పూర్తిగా అవాస్తవం

* లిఖితపూర్వకంగా ఎంపీఓ కు అందజేసిన గ్రామస్తులు

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజపేట మండలం పుట్టగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిపై కొందరు వ్యక్తులు కలెక్టర్ కు చేసిన ఫిర్యాదు పూర్తిగా అవాస్తవమని, నిబంధనల ప్రకారం ఉద్యోగం చేస్తున్నందుకే గిట్టని వారు కార్యదర్శి పై ఫిర్యాదు చేశారని ఎంపీఓ ఆవుల కిషన్ కు పుట్టగూడెం గ్రామస్తులు శుక్రవారం లిఖితపూర్వకంగా పత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ కు కొందరు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీ ఓ ఆవుల కిషన్ శుక్రవారం పుట్టగూడెం గ్రామంలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కార్యదర్శి పై వచ్చిన అభియోగాలు అవాస్తవమన్నారు.

# రాజాపేట లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు






రాజాపేట, ప్రజా స్ఫూర్తి : జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శుక్రవారం రాజపేట మండలంలోని రాజపేట, చల్లూరు, బొందుగుల ఉన్నత పాఠశాలలలో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజాపేటలో ప్రధానోపాధ్యాయులు జయంత అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ సైన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవులు , జానయ్య , ప్రభాకర్ , వెంకటేశ్వర రావు , లెనిన్ శ్రీదేవి, అనిత, అరుణ కుమారి, సునీత, సౌజన్య, పాట్రీషియ, రాజేశ్వరి, మాధవి, జూనియర్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు. చల్లూరు జి. ప.ఉ.పా. లో జాతీయ సైన్స్ దినోత్సవం : రాజపేట మండలం చల్లూరు జి. ప.ఉ పా. లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సి .వి . రామన్ తన ఆవిష్కరణ 'రామన్ ఎఫెక్టు' ను ప్రకటించిన రోజును ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపకుంటారని తెలిపారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు , ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు ప్రధానోపాధ్యాయురాలు . బి. వసంత బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రాజు, వీరభద్రం తో పాటు ఇతర ఉపాధ్యాయులు రమేష్, సుశీల, అమరేందర్ రెడ్డి, వరలక్ష్మి, కృష్ణవేణి , సారంగపాణి పాల్గొన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ ఆధ్వర్యంలో బొందుగుల ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవ వేడుకలు జరిగాయి.

# నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు

* శ్రీ చైతన్య స్కూల్ లో వైజ్ఞానిక ప్రదర్శన
* శోభ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ బి నాగిరెడ్డి





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నేటితరం విద్యార్థులే.. భవిష్యత్తులో రేపటి తరం శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని శోభ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ బి నాగిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో సైన్స్ డే ను పురస్కరించుకొని పాఠశాల ప్రిన్సిపల్ శ్వేతా బాన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల నుంచి హైస్కూల్ వరకు విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు. నో వేస్ట్ లో కాస్ట్ పద్ధతిలో తమ చుట్టూ ఉన్న అక్కరకురాని వస్తువులను సేకరించి సబ్జెక్టు వారిగా తయారు చేసి, ప్రదర్శించిన తీరు సందర్శకులను ఆశ్చర్యపరిచింది. మానవ ఆలోచనలకు అనుగుణంగా శాస్త్రీయ సూత్రాలను, ఎలా ఉపయోగకరంగా మార్చుకోవచ్చునో తాము తయారు చేసిన పరికరాల ద్వారా అనర్గళంగా వివరించడం అతిథులను ఆశ్చర్యపరిచింది. ఒక చర్య మరో చర్యకు, పాతది కొత్త దానికి ఎలా దారి తీస్తుందో చెప్పిన విధం పలువురిని ఆకట్టుకుంది. వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరైన శోభ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ బి. నాగిరెడ్డి విద్యార్థుల ప్రదర్శనలో తిలకించిన అనంతరం మాట్లాడారు. సమాజంలోని అన్ని రుగ్మతలకు సైన్స్ ఔషధమన్నారు. వైజ్ఞానిక విద్య వైపు విద్యార్థులు అడుగులు వేయాలని సూచించారు. ప్రారంభంలో మానవుడు ప్రకృతి పరిశీలన, ప్రకృతితో నిత్యం తాను పడిన సంఘర్షణ నుంచి ప్రకృతి రహస్యాలను క్రోడీకరించి వాటిని ఒక క్రమ పద్ధతిలో సమాజానికి అర్థమయ్యే రీతిలో ప్రదర్శించాలన్నారు. తదనంతరం కాలంలో అనేక మార్పులు వచ్చినందున విద్యార్థుల శాస్త్రీయ అవగాహనకు పాఠశాల కేంద్రమైందన్నారు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం అను వాటిని తాము చదువుతున్నప్పుడు తమ మనసులో కలిగిన మరో కొత్త విషయాలకు విద్యార్థులు తమ సృజన జోడించి ప్రదర్శించడం ఎంతో బాగుందని అభినందించారు.

## విద్యార్థుల ఆలోచనలు అమోఘం

* టి సతీష్, చైతన్య పాఠశాలల అసిస్టెంట్ జనరల్ మేనేజర్

శ్రీ చైతన్య పాఠశాలలోని విద్యార్థుల ఆలోచనలు అమోఘమని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టి. సతీష్ అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్ కు సంబంధించి భవిష్యత్తులో స్పేస్ సెంటర్లో మానవ జీవనానికి అవకాశాలను వెతకడం, మానవ శరీర నిర్మాణం, పర్యావరణం గురించి ప్రదర్శనలు బాగున్నాయన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం, భూకంపాలు, వాటి వల్ల సంభవించే మార్పుల గురించి పిల్లల ఆలోచనలు ప్రదర్శనల రూపంలో తెలపడం ఆనందంగా ఉందన్నారు. ఇంట్లో ఎంతో సాధారణంగా కనిపించే విద్యార్థులు తయారు చేసిన కార్యక్రమాలు పరికరాలు, వివరించిన తీరు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శోభ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ ఇంజనీర్ శివారెడ్డి సురేష్, ఆర్ఐ ఎం వెంకట్ రెడ్డి, కోఆర్డినేటర్ రఘువంశీ, ఏవో గోపి చంద్, డీన్ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వీరబాబు ను పరామర్శించిన సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి మణుగూరు ఏరియాలో డ్యూటీ కి సంబంధం లేని ఇతర సివిల్ పనులు చేపించడం వల్ల అస్వస్థతకు గురై కొత్తగూడెం సింగరేణి మెయిన్ హాస్పిటల్ చికిత్స పొందుతున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్ పి వీరబాబు నీ శుక్రవారం నాడు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియు నాయకులు నాయకులు పరామర్శించారు. సంఘటనకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు సూరం ఐలయ్య, భూక్య రమేష్ ,గుగులోత్ సక్రం లు పరామర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు భూక్యా రమేష్ మాట్లాడుతూ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉండి ప్రస్తుతం పిట్ ఉండి మణుగూరు ఏరియాలో ప్రవేట్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న పి వీరబాబును మరి కొంతమంది సెక్యూరిటీ గాడ్స్ పై మణుగూరు ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కే శ్రీనివాసరావు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని, గురువారం మణుగూరు ఓసి 2 దగ్గర అటవీ ప్రాంతంలో సింగరేణి సివిల్ డిపార్ట్మెంట్ వారు చేయవలసిన పనులను ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్ లతో చేపించారని దీని ఫలితంగా పి వీరబాబుకి గతంలో సర్జరీ అయిన ప్రదేశంలో ఒత్తిడి పెరిగి తీవ్ర అస్వస్థకు గురి కావడంతో మణుగూరు



ఏరియా హాస్పిటల్ నుండి కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ కు రిఫర్ చేసి వైద్యం చేస్తున్నట్లుగా సీఐటీయూ తెలిపారు. సింగరేణిలో సంస్థను రక్షించే పనిలో విధులు నిర్వహించే ప్రైవేటు సెక్యూరిటీ గార్డులతో వారి డ్యూటీలకు సంబంధం లేని ఇతర పనులను అప్పగించి అనారోగ్యం పాలు కావడానికి కారణమైన ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సెక్యూరిటీ విభాగంలో కొంతమంది అధికారులు ప్రైవేటు గార్డుల పట్ల చిన్న చూపు చూడడం, వారితో ఇంటి పనులు వంట పనులు సొంత పనులు చేయించుకోవడం, డ్యూటీకి సంబంధం లేని ఇతర పనులు చేపిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పి వీరబాబు కు పూర్తిగా తగ్గేవరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,చికిత్స కాలానికి నష్టపరిహారం చెల్లించి మరియు వేతనం కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని.. అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తి సర్ సీవీ రామన్

**- లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం**






చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఆధునిక భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సీవీ రామన్ ముఖ్యుడని లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరేళ్ల శ్రీనివాస్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కూరెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో నోబెల్ అందుకున్న, మొట్టమొదటి ఆసియా వాసిగా రికార్డు నెలకొల్పిన వ్యక్తి భారతరత్న సర్ సివి రామన్ అని కొనియాడారు. సైన్సు దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో బయో సైన్స్ అరుణ, ఫిజికల్ సైన్స్ మాధవ రెడ్డిల ఆధ్వర్యంలో పిల్లలందరూ చక్కగా సైన్స్ పరికరాలతో ప్రయోగాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. విద్యార్థుల ప్రతిభా పాటవాలను మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కురెళ్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, అరుణ, విజయలక్ష్మి, పురుషోత్తమ చారి, రమేష్ రెడ్డి, అనిల్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితంలో సైన్స్ పాత్ర కీలకం

**- జిల్లా సైన్స్ అధికారి చలపతి రాజు**





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన శాస్త్రవేత్త, ప్రతిష్టాత్మక నోబెల్ ప్రైజ్ విజేత చంద్రశేఖర్ వెంకటరామన్ భౌతిక శాస్త్రంలో చేసిన అపార సేవలకు గుర్తుగా ప్రతియేటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థిని, విద్యార్థులకు అకాడమిక్ ఫెయిర్ నిర్వహించారు. నారాయణ పాఠశాల పాల్వంచ శాఖ ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కారక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైన్స్ అధికారి చలపతి రాజు, విశిష్ట అతిథిగా కొత్తగూడెం పాలిటెక్నిక్ కళాశాల హెచ్.ఓ.డి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి సి.వి.రామం చిత్రపటానికి పూలమాల వేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చలపతిరాజు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సైన్స్ లేని జీవితాన్ని ఊహించలేమని, ఆధునిక సమాజంలో సైన్స్ పాత్ర కీలకం అని, ఈ ప్రపంచాన్ని శాసిస్తుంది, నడిపిస్తుంది సైన్స్ మాత్రమే అని, పాల్వంచ నారాయణ పాఠశాలలో అద్భుతంగా అకాడమిక్ ఫెయిర్ నిర్వహించడం అభినందనీయమని, విద్యార్థులలో దాగిన ప్రతిభను వెలికితీయడానికి ఇది ఒక మంచి ప్రయత్నమని, పాల్వంచ నారాయణ పాఠశాల విద్యార్థులకు పోటీతత్వాన్ని పెంచే విధంగా చక్కనివిద్యా ప్రణాళిక చేసి అమలు పరుస్తున్న నారాయణ యాజమాన్యాన్ని అభినందించారు. ఖమ్మం నారాయణ పాఠశాలల ఏజీఎం యోగ రాంకీ మాట్లాడుతూ పోటీ తత్వంతో విద్యార్థులలో మేధోవికాసం పెరుగుతుందని, సైన్స్ ప్రాజెక్టులకు తమ నారాయణ విద్యాసంస్థ అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పాల్వంచ బ్రాంచ్ సిబ్బందిని, తల్లితండ్రులను అభినందించారు, విద్యార్థుల ఉత్సాహాన్ని ప్రశంసించారు. ఈ అకాడమిక్ ఫెయిర్ ప్రదర్శన కార్యక్రమంలో అన్ని తరగతుల విద్యార్థులు టీచర్ల సహకారంతో రూపొందించిన ప్రాజెక్టులను విచ్చేసిన అతిథులకు, విద్యార్థిని విద్యార్థులకు, తల్లితండ్రులకు వివరిస్తూ తమ అద్భుత ప్రతిభను చాటుకున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందచేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి మెడల్స్ , సర్టిఫికెట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా ఖమ్మం జోన్ ఈ చాంప్స్ కోఆర్డినేటర్ వినోద లక్ష్మి, ఈ టెక్నో కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, ఈటెక్నో ఏ.డి రామకృష్ణ, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత శ్రీ, సురేష్, రమేష్, అనూష, దీప్తి, రహీమా, కళ్యాణి, శైలజ, శ్రీలత, ఉషా, అఫ్రీన్, జాహ్నవి, నాగరాణి, వినయ్, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు విద్యతోపాటు శాస్త్ర, సాంకేతిక రంగాలలో రాణించాలి

*** ట్రస్మ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు ఆంజనేయులు..**









జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులు విద్యతోపాటు శాస్త్ర, సాంకేతిక రంగాలలో రాణించాలని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్, ట్రస్మ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు బిర్రు ఆంజనేయులు అన్నారు. జాతీయ వైజ్ఞానిక ప్రదర్శన దినోత్సవం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్ భగత్ సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల లో సైన్స్ ఫెస్ట్ (2025)నుశుక్రవారం టియుడబ్ల్యుజె (ఐజెయు) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు గౌడ్, ట్రపస కుత్బుల్లాపూర్ అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ వినోద్ జాదవ్,దయాకర్,లీడ్ సంస్థ కోఆర్డినేటర్ అంజని మాథూర్, డైరెక్టర్ బిర్రు శోభారాణి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు ఏ రంగంలోనైనా కష్టపడే కంటే ఇష్టపడితే కలలు సాకారం చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఎంచుకున్న రంగాలలో పట్టుదల కనబరిస్తే ప్రతి విద్యార్థి ప్రతిభావంతుడు అవుతారన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్డులు తయారుచేసిన సుమారు 150 కి పై నమూనాలను వారు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నే ఫాతిమా,ప్రశాంతి,కృష్ణవేణి, మహేశ్వరి,సాజిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదం డ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల తీరు మారకపోతే.. కఠిన చర్యలు తప్పవు

**- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ ఆసుపత్రిలోని విధులు నిర్వహిస్తున్న వైద్యులు.. తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 16, 20వార్డులను శుక్రవారం ఉదయం 6గంటలకు సందర్శించారు. పలు ఇళ్ళకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సౌకర్యం, డ్రైనేజీ సమస్యలు, ఇంటింటికి చెత్త సేకరిస్తున్నారా లేదా, అనే విషయాలను కలెక్టర్ హనుమంతరావు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ , మున్సిపాలిటీలో పబ్లిక్ టాయిలెట్స్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భగీరథ స్కీములో భాగంగా వాటర్ ట్యాంకులు ఎందుకు నిర్మించలేదని మున్సిపల్ కమిషనర్ ను ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు త్వరగా పూర్తి చేయాలని, బిల్డింగ్ పర్మిషన్ విషయాల్లో త్వరగా అనుమతులు ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజు ప్రతి వార్డులో శానిటేషన్ తప్పకుండా చేయాలన్నారు. వార్డులో అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్ నిర్మాణాలో భాగంగా తమ ఉపాధి కోల్పోతున్నామని ప్రజలు కలెక్టర్ కు విన్నవించారు. వివరించారు. వెంటనే స్పందించి ప్రత్యామ్నాయంగా వేరేచోట ఉపాధి కోల్పోకుండా స్థలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమగ్ర కుటుంబ సర్వే, ఈ రోజుతో చివరి రోజు అని ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల హాజరు రిజిస్టర్ లను పరిశీలించారు. విధులకు గైర్హాజరైన డాక్టర్ శ్రవన్ కు శోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ హాస్పిటల్లో సాధారణ ప్రసవాల సంఖ్య తక్కువ ఉండడం పట్ల వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలో రెండు రోజులు మాత్రమే ఆపరేషన్లు చేయడం ఏంటని ప్రశ్నించాడు. ఇప్పటికే వైద్యులపై అనేక ఆరోపణలు ఉన్నాయని, తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ హాస్పిటల్ వద్ద ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తామని ప్రతి సోమవారం ఫిర్యాదుల రివ్యూ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తాయి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తాయని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ లోని టివిఆర్ మోడల్ స్కూల్ నందు "స్పెక్ట్రం 5" పేరుతో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ వైజ్ఞానిక విద్య వైపు విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. సైన్స్ ఫెయిర్ లు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతతో పాటు ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహమ్మద్ రషీదా రఫీ, నాయకులు చింతల్ అసోసియేషన్ సభ్యులు రవి, మురళి, టెంపుల్ కమిటీ సభ్యులు జగన్నాథం, చంద్రానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమూర్తి, సత్యనారాయణ, పాఠశాల చైర్మన్ టీ.కోటిరెడ్డి, కరెస్పాండెంట్ వి.వి.సుబ్బా రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ రావు, బి. కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ ఐడిపిఎల్ లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నందు నిర్వహించిన "సైన్స్ ఎక్స్పో" కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో సైన్స్ ఎక్స్పో ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమునాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు పిల్లల్లోని మేధస్సును మరింత పెంచుతాయని అన్నారు. పిల్లల్లో మేధాశక్తిని వెలికితీసేలా తల్లిదండ్రులు కృషిచేస్తే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రీజినల్ ఇన్చార్జి పద్మజ, ప్రిన్సిపాల్ శ్వేతా రెడ్డి, కో ఆర్డినేటర్లు వెంకట శివ, మురళీ కృష్ణ, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, నాయకులు ఎర్వ సాయి కిరణ్, శశి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు పాటుపడాలి

*** బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు పాటుపడాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మ నగర్ బి "సృజన వెల్ఫేర్ అసోసియేషన్" నూతన కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంధర్బంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మైసమ్మ నగర్ బి నూతన సంక్షేమ సంఘం సభ్యులకు నా అభినందనలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘం ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ ప్రెసిడెంట్ రుద్ర అశోక్, జగద్గిరి గుట్ట వేంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ వేణు యాదవ్, నాయకులు మెట్ల శ్రీను, ప్రెసిడెంట్ బసప్ప గుప్త, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు రాములు, మాజీ కోశాధికారి సంతోష్, బస్తీ వాసులు పాపిరెడ్డి, హన్మంతు, నాగార్జున, ప్రేమ్ సాయి, చింటు, శ్రీనివాస్ రెడ్డి , కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భావితరాల శాస్త్ర వేత్తలు నేటి విద్యార్థులే

*** టీవిఆర్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి**





కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : భావితరాల శాస్త్ర వేత్తలు నేటి విద్యార్థులేనని టీవిఆర్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి అన్నారు. జాతీయసైన్స్ డే సందర్భంగా శుక్రవారం గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అపురూప కాలనీలో టీవిఆర్ మోడల్ హై స్కూల్, ఎస్ ఆర్ నాయక్ నగర్ లో సత్యవాణి విద్యానికేతన్, చింతల్ లోని బచ్పన్ ఒలంపియాడ్ స్కూల్, సూరారం లలో బచ్పన్ ప్లే స్కూల్ లో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సి.వి.రామన్ చిత్ర పటానికి ఆయనతో పాటు దీక్ష జూనియర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సురా రవి చంద్రారెడ్డి లు పాల్గొని పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఫెయిర్ ప్రారంభించారు. అనంతరం ఈ సైన్స్ డే లో 5 వ తరగతి విద్యార్థుల నుండి 9 వ తరగతి విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల నమూనాలను తయారు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా వారిలోని ప్రతిభను వెలికి తీసిన సైన్స్ అధ్యాపక బృందాన్ని పాఠశాల యాజమాన్యం అభినందించారు. విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. నిత్య జీవితానికి సైన్స్ ఎంతగానో దోహదపడుతుందని తెలియజేశారు వాటి ప్రాముఖ్యతను తెలియజేసిన విద్యార్థిని విద్యార్థులను పలువురు ప్రశంసించారు. నూతన విద్యా విధానంతో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్నిపాఠశాల యాజమాన్యాన్ని సందర్శకులు కొనియాడారు.ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దిన జ్ఞాపక బృందాన్ని ప్రతిభను కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి.కోటి రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్స్ దీప్తి రెడ్డి లు అభినందించారు.

# ప్రతి నియోజకవర్గంలో మినీ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్ను అభివృద్ధి చేస్తా మని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఫిక్కిలో నిర్వహించిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. "ఎస్సీ, ఎస్టీలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన ప్రతి హామీని



ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే.. మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాం. పారిశ్రామికవేత్తలకు రాయి తీగా అందాల్సిన బకాయిలు రూ.4500 కోట్లకు పైనే ఉన్నాయి. వీటిలో రూ.2,200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రావాల్సి ఉంది. మేం అధికారంలోకి రాగానే ఈ బకా యిల చెల్లింపుపై దృష్టి సారించాం. వచ్చే నెలలో రూ.300 కోట్లు చెల్లిస్తాం. ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి అందించే ఎంఎస్ఎంఈ ప్రత్యేక పాలసీ తీసుకొచ్చాం. స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వన రులను అందిస్తాం. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. రుణాలు పొందటంలో ఔత్సా హిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. తమిళనాడు, కర్ణాటకలో పారిశ్రామిక విధా నాలపై అధ్యయనం చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తాం. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తాం. ప్రత్యేక బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటాం'' అని శ్రీధర్ బాబు తెలిపారు.

# భాజపా పాలనలో అన్ని విధాలుగా అణచివేత

**: మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్: సమాజంలో అన్ని వర్గా లకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. భాజపా పాలనలో దేశంలో అన్ని విధాలుగా అణచివేత కొనసాగుతోందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ఇప్పుడు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం అవసరమని వివరించారు. రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కుటుంబ సర్వేలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం కూడా సామాజిక న్యాయం గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని.. ప్రచారం చేయడంలో కొంత



వెనుకబడిపోయామని తెలిపారు. దేశం మొత్తంలో తెలంగాణలోనే ఈ ఏడాది ఎక్కువ ధాన్యం పండించినట్లు పేర్కొన్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ఇవన్నీ జనంలోకి తీసుకెళ్లి ప్రచారం చేసుకోవాలని వివరించారు. పీసీసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తది తరులు పాల్గొన్నారు.

# మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్

దిల్లీ: వరంగల్ జిల్లా మామునూరు విమా నాశ్రయం అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 150 కి.మీ పరిధిలో మరో విమానాశ్రయం ఉండకూడదని గతంలో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. జీఎంఆర్‌తో ప్రత్యేకంగా చర్చలు జరిపారు. దీంతో మామునూరుకు జీఎంఆర్ అంగీకారం తెలిపింది. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని



రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. ఎయిర్‌పోర్టు విస్తరణకు అవసరమైన 256 ఎకరాల భూ సేకరణకు రూ.205 కోట్లు విడుదల చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే జీవో విడుదల చేసింది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి డిజైన్లతో కూడిన డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఎయిర్‌పోర్టు అథారిటీకి రోడ్లు, భవనాల శాఖ లేఖ రాసింది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు పరిధిలో 696 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమిలో కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ వెల్లడించింది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది.

*** మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారం: మంత్రి కోమటిరెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమ టిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవం తమవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.



# హైదరాబాద్ శివారులో అగ్ని ప్రమాదం... ముగ్గురి మృతి

హైదరాబాద్ శివార్లలో అగ్ని ప్రమాదం సంభవించి ముగ్గురు మృత్యువాత పడ్డారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి మండలం పుప్పాలగూడలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రెండంతస్తుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో ఊపిరాడక ముగ్గురు మృతి చెందారు. లంగర్‌హౌస్ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. మొదటి అంతస్తులో చిక్కుకున్న ఇద్దరు మహిళలు, ఒక చిన్నారిని స్ట్రెచర్‌పై బయటకు తీసుకువచ్చారు. వారిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతి చెందిన వారిని ఏడేళ్ల సిజిరా, సహానా (40), జమీలా (70)గా గుర్తించారు. మంటలు చెలరేగడంతో భవనంలో మూడు గ్యాస్ సిలిండర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ, సాయంత్రం సుమారు ఐదున్నర గంటలకు తమకు ఫోన్ వచ్చిందని, ఘటనాస్థలికి చేరుకొని గ్రౌండ్ ఫ్లోర్‌లో మంటలను అదుపు చేసే సమయంలో ఫస్ట్ ఫ్లోర్‌లో ఐదుగురు చిక్కుకున్నట్లు తెలిసిందని వెల్లడించారు. నిచ్చెన ద్వారా ఫస్ట్ ఫ్లోర్‌కు చేరుకొని, తలుపులను పగులగొట్టి ఒక చిన్నారి, ఇద్దరు మహిళలను బయటకు తీసుకువచ్చామని తెలిపారు. వారిని అంబులెన్సులో ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

# కివీస్ మ్యాచ్‌కు దూరం కానున్న రోహిత్




### కివీస్ మ్యాచ్‌లో భారత కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

### ఓపెనింగ్ జోడీగా కేఎల్ రాహుల్ ఆడే అవకాశం

### పంత్‌కు కూడా తుది జట్టులో చోటు దక్కే చాన్స్

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భాగంగా న్యూజిలాండ్ తో ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది టీమిండియా. అయితే ఈ మ్యాచ్ కు కెప్టెన్ రోహిత్ శర్మ గాయం కారణంగా దూరమైనట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో భారత్... రోహిత్ తో కాకుండా మరో ప్లేయర్ కెప్టెన్సీలో కివీస్ తో తలపడనున్నట్లు తెలిసింది. మరి ఆ కెప్టెన్ ఎవరు? అసలు ట్రైనింగ్ సెషన్ లో రోహిత్ శర్మకు ఏమైంది? ఇప్పుడు తెలుసుకుందాం.. ప్రస్తుత ఛాంపియన్స్ ట్రోఫీలో ఇప్పటికే టీమిండియా సెమీ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఇప్పుడు ఆదివారం( మార్చి 2) న్యూజిలాండ్ తో నామమాత్రపు మ్యాచ్ ఆడనుంది. అయితే రీసెంట్ గా పాకిస్తాన్ తో జరిగిన మ్యాచ్ లో కెప్టెన్ రోహిత్ శర్మ పిక్కల నొప్పితో ఇబ్బంది పడ్డాడు. దీంతో అతడు మ్యాచ్ మధ్యలోనే కాసేపు విశ్రాంతి తీసుకుని ఆడాడు. పాకిస్థాన్ తో మ్యాచ్ తర్వాత న్యూజిలాండ్ తో జరగబోయే మ్యాచ్ కు ముందు టీమిండియా ట్రైనింగ్ సెషన్ లో పాల్గొంది. కానీ ఈ నెట్ ప్రాక్టీస్ సెషన్ లో నొప్పి కారణంగా రోహిత్ పాల్గొనలేదు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తో మాట్లాడి రెస్ట్ తీసుకున్నాడు. ఇప్పుడు న్యూజిలాండ్ తో జరగబోయే మ్యాచ్ కూడా అందుబాటులో ఉండకూడదని రోహిత్ నిర్ణయించుకున్నాడట. ఎందుకుంటే మార్చి 4న భారత్ సెమీఫైనల్ ఆడనుంది. ఒకవేళ నొప్పితోనే రోహిత్.. న్యూజిలాండ్ మ్యాచ్ లో పాల్గొంటే సెమీస్ మ్యాచ్ కు మరింత ఇబ్బంది పడాల్సి ఉంటుంది. దీంతో ముందస్తు జాగ్రత్తగా సెమీస్ కోసం.. రోహిత్ కివీస్ తో మ్యాచ్ కు దూరం కానున్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలోనే కివీస్ మ్యాచ్ కు వైస్ కెప్టెన్ గా ఉన్న శుభ్‌మన్ గిల్ తాత్కాలిక సారథ్య బాధ్యతలు చెపట్టే అవకాశం ఉందని తెలిసింది.

వాస్తవానికి గిల్ కూడా జ్వరంతో బాధపడుతున్నాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ తర్వాత మళ్లీ అది నిజం కాదని కూడా తెలిసింది. ఒకవేళ కివీస్ తో మ్యాచ్ కు నిజంగానే రోహిత్ దూరమైతే.. గిల్ కు ఓపెనింగ్ జోడీగా కేఎల్ రాహుల్ ఆడే అవకాశం ఉందని తెలిసింది. ఇదే సమయంలో పంత్ కు కూడా తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉండొచ్చు. కాగా, గ్రూప్- ఏ నుంచి న్యూజిలాండ్, టీమిండియా సెమీస్ బెర్త్ ను ఖరారు చేసుకున్న సంగతి తెలిసిందే.

## డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్ రెండో విజయం



### 6 వికెట్ల తేడాతో బెంగళూరుపై గెలుపు

**న్యూఢిల్లీ:** 2025 డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్ రెండో విజయం సాధించింది. టోర్నీ లో గురువారం రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ అమ్మాయిలు 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ఆర్సీబీ నిర్దేశించిన 126 పరుగుల టార్గెట్‌ను గుజరాత్ 16.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అష్లీ గార్డనర్ (58 పరుగులు) హాఫ్ సెంచరీతో అదరగొట్టగా, లిచీఫీల్డ్ (30ి పరుగులు) రాణించింది. బెంగళూరు బౌలర్లలో రేణుకా సింగ్, వర్‌హామ్ తలో 2 వికెట్ల దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. కనిక అహుజ (33) రాణించింది. రాఘ్వి (22), వేర్‌హమ్ (20) ఫర్వాలేదనిపించారు. ఓపెనర్లు స్మృతి మంధాన (10 పరుగులు), వ్యాట్ హెూడ్జ్ (4) విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి, ఆర్సీబీని తక్కువ స్కోర్‌కే కట్టడి చేసింది. ఈ సిరీస్‌ను విజయంతో ఆరంభించిన ఆర్సీబీ రెండో మ్యాచ్‌లోనూ నెగ్గి జోరుమీద కనిపించింది. కానీ, తర్వాత వరుసగా ముంబయి, యూపీ వారియర్స్‌తో మ్యాచ్‌ల్లో ఆర్సీబీ ఓటమిపాలైంది. తాజాగా గుజరాత్‌తోనూ ఓడింది.




## పాకిస్థాన్ సూపర్ లీగ్ 2025 షెడ్యూల్ విడుదల

**కరాచీ:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పీఎస్ఎల్ (పాకిస్థాన్ సూపర్ లీగ్) 2025 షెడ్యూల్ ను ప్రకటించింది. ఏప్రిల్ 11న జరిగే తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ ఛాంపియన్స్ ఇస్లామాబాద్ యునైటెడ్.. లాహెూర్ ఖలందర్స్ తో తలపడనుంది. ఈ లీగ్ దశలో మొత్తం 30 మ్యాచ్‌లు జరుగుతాయి. దీని తర్వాత.. క్వాలిఫైయర్, ఎలిమినేటర్ 1, ఎలిమినేటర్ 2 మ్యాచ్ లు వరుసగా మే 13, మే 14, మే 16 తేదీలలో జరుగుతాయి. పీఎస్ఎల్ 2025 ఫైనల్ మ్యాచ్ మే 18,2025న లాహెూర్ లోని గడాఫీ స్టేడియంలో జరుగుతుంది. పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025 ఏప్రిల్ 11 నుంచి ప్రారంభం కానుంది. ఫైనల్ మ్యాచ్ లాహెూర్ వేదికగా.. మే 18న జరగనుంది. ఈ టోర్నమెంట్ లో రావల్పిండి మైదానం మొత్తం 11 మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనుండగా.. లాహెూర్ లోని గడాఫీ స్టేడియం 13 మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనుంది. కరాచీ, ముల్తాన్ లు చెరో 5 మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. పాకిస్థాన్ సూపర్ లీగ్ 2025.. ఐపీఎల్ 2025తో పోటీ పడనుంది. ఎందుకంటే ఐపీఎల్ 2025 మార్చి 22 నుంచి మే 25 వరకు జరగనుంది. పాకిస్థాన్ సూపర్ లీగ్ సమయంలో వినోదానికి లోటు ఉందని పీఎస్ఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సల్మాన్ నజీర్ వెల్లడించారు. పాకిస్థాన్ సూపర్ లీగ్ 10వ ఎడిషన్ షెడ్యూల్ ప్రకటించినందుకు తాము సంతోషిస్తున్నామన్నారు.

## ఐపీఎల్లో ఆడటం కోసమే స్టార్క్ మెగాటోర్నీ స్కిప్

### స్టార్క్‌పై విమర్శలు వ్యక్తం చేస్తున్న పలువురు

**సిడ్నీ:** ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిషెల్ స్టార్క్.. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. వ్యక్తిగత కారణాలతో తను ఈ టోర్నీకి దూరంగా ఉన్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. అయితే తాజాగా దీనిపై స్టార్క్ స్పందించాడు. వ్యక్తిగత కారణాలతోపాటు చీలమండ గాయం కారణంగానూ మెగాటోర్నీకి దూరమయ్యానని తెలిపాడు. అయితే ప్రస్తుతం తాను విశ్రాంతి తీసుకుంటున్నాని, విరామం అనంతరం అంతర్జాతీయ క్రికెట్ కు సన్నద్ధం కావాలని భావిస్తున్నట్లు పేర్కొన్నాడు. ఈక్రమంలో ఐపీఎల్లో ఆడనున్నట్లు, ఆ తర్వాత ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్స్, వెస్టిండీస్ టూర్లో ఆడనున్నట్లు పేర్కొన్నాడు. దీంతో చాలామంది స్టార్క్ పై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్లో ఆడటం కోసమే మెగాటోర్నీని స్కిప్ చేశాడని పేర్కొంటున్నారు. అయితే గాయం కారణంగానే తను దూరమై, ఐపీఎల్లో ఆడటం ద్వారా సన్నాహకాలను పరిశీలించుకోవాలని తను భావిస్తున్నట్లు వాదిస్తున్నారు. ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్ ను 2021లో ప్రారంభించినప్పుడు లైట్ తీసుకున్నామని, అయితే ఫైనల్ పోరును చాలా ఆసక్తికరంగా చూశామని స్టార్క్ చెప్పుకొచ్చాడు. ఫైనల్ కు ఎలాగైనా అర్హత సాధించాలని అప్పుడే




అనుకున్నామని వెల్లడించాడు. 2023లో భారత్ పై గెలిచి టైటిల్ దక్కించుకున్న ఆసీస్.. 2025 ఎడిషన్ లోనూ ఫైనల్ కు అర్హత సాధించింది. లండన్ లోని లార్డ్స్ మైదానంలో జరిగే ఫైనల్లో సౌతాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనుంది . ఈ మ్యాచ్ లో గెలిచి రెండోసారి కప్పును సాధిస్తామని స్టార్క్ ధీమా వ్యక్తం చేశాడు. ఈనెల 28న ఆఫ్గన్ తో ఆసీస్ తలపడనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు నాకౌట్ కు అర్హత సాధిస్తుంది. తమ చివరి మ్యాచ్ ల్లో ఇంగ్లాండ్ పైనే రెండు జట్లు గెలుపొందాయి. నిజానికి ఈ టోర్నీలో బలహీనమైన జట్టుతోనే ఆసీస్ బరిలోకి దిగుతోంది. స్పీడ్ స్టార్లు కెప్టెన్ పాట్ కమిన్స్, స్టార్క్, జోష్ హేజిల్ వుడ్ లేకుండానే మెగాటోర్నీలో ఆసీస్ ఆడుతోంది. వారి స్థానాల్లో స్పెన్సర్ జాన్సన్, బెన్ ద్వార్షియస్, నాథన్ ఎల్లిస్ తదితర పేసర్లు ఆడుతున్నారు. ఇక టోర్నీ తొలి మ్యాచ్ లో ఇంగ్లాండ్ పై ఆసీస్ అద్భుత విజయం సాధించింది. 350ం పరుగుల టార్గెట్ ను కూడా జట్టు సునాయసంగా ఛేదించింది. ఆ తర్వాత ప్రొటీస్ జరగాల్సిన మ్యాచ్ రద్దు కావడంతో , ఆఫ్గానిస్థాన్ తో జరిగే చివరి మ్యాచ్ లో గెలిస్తే నాకౌట్ కు అర్హత సాధిస్తుంది. అనుభవజ్ఞుడైన కెప్టెన్ స్టీవ్ స్మిత్ జట్టును నడిపిస్తున్నాడు. ఇప్పటికే రెండుసార్లు మెగాటోర్నీని సాధించిన ఆసీస్, ముచ్చటగా మూడోసారి గెలుపొందాలని భావిస్తోంది. 2009 తర్వాత మళ్లీ ఆసీస్ ఎప్పుడూ మెగాటోర్నీ ఫైనల్ కు చేరలేదు. దీంతో ఈసారి ఆ లోటును తీర్చుకోవడంతోపాటు చాంపియన్ గా నిలవాలని భావిస్తోంది.

## దలాల్ స్ట్రీట్‌పై ట్రంప్ సుంకాల హెచ్చరికల దెబ్బ..

### రెండు శాతానికి పైగా నష్టపోయిన సూచీలు..



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'టారిఫ్'ల మోత మోగుతున్నది. ఇప్పటికే చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనంగా పది శాతం సుంకాలు విధిస్తామని డొనాల్డ్ ట్రంప్ తాజాగా చేసిన ప్రకటన ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది. అంతర్జాతీయ మార్కెట్లలో నష్టాలకు అనుగుణంగా ఫలితంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లు నెత్తురోడాయి. బీఎస్ఈ-30 సెన్సెక్స్, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ దాదాపు రెండు శాతం వరకూ నష్టపోయాయి.

బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు (1.90 శాతం) నష్టపోయి 73,198.10 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 1,471.16 పాయింట్లు (1.97 శాతం) పతనంతో 73,141.27 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ వరుసగా ఎనిమిదో రోజు నష్టాలను చవి చూసింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ట్రేడింగ్ ముగిసే సమయానికి 420.35 పాయింట్లు (1.86 శాతం) నష్టపోయి 22,124.70 పాయింట్ల వద్ద స్థిర పడింది. గతేడాది సెప్టెంబర్ 27న జీవిత కాల గరిష్ట స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన సెన్సెక్స్.. నాటి నుంచి ఇప్పటి వరకూ 12,780.15 పాయింట్లు (14.86శాతం) నష్టపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ గత సెప్టెంబర్ 27న జీవిత కాల గరిష్టం 26,277.35 పాయింట్లకు చేరుకుంది. నాటి నుంచి ఇప్పటి వరకూ 4,152.65 పాయింట్లు (15.80 శాతం) నష్టపోయింది.

బీఎస్ఈ సెన్సెక్స్‌లో టెక్ మహీంద్రా ఆరు శాతానికి పైగా నష్టపోగా, ఇండస్ఇండ్ బ్యాంకు ఐదు శాతం పతనమైంది. మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, టైటాన్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), నెస్లే, మారుతి సుజుకి స్టాక్స్ భారీగా పతనం అయ్యాయి. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మాత్రమే లాభాలతో ముగిసింది. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ భారీ నష్టాలతో సరిపెట్టుకున్నాయి. యూరోపియన్ యూనియన్ మార్కెట్లు పూర్తిగా నష్టాలతో ముగిశాయి. గురువారం వరకూ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.556.56 కోట్ల విలువైన వాటాలు ఉపసంహరించారు. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌పై 0.69 శాతం తగ్గి 73.53 డాలర్లు పలుకుతుంది.

## సెబీ కొత్త చీఫ్‌గా తుహిన్ కాంత పాండే నియామకం




**ముంబై:** స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నూతన సారథిగా తుహిన్ కాంత పాండే నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనకు సెబీ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర నియామకాల కమిటీ గురువారం ఇందుకు ఆమోదం తెలిపింది. కాగా, ప్రస్తుతం సెబీ చీఫ్‌గా ఉన్న మాధాబీ పురీ బుచ్ మూడేళ్ల పదవీ కాలం నేటితో (ఫిబ్రవరి 28తో) ముగియనుంది. ఈ నేపథ్యంలో తుహిన్ కాంత పాండేను సెబీ కొత్త చీఫ్‌గా ప్రభుత్వం నియమించింది.

తుహిన్ కాంత పాండే 1987 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో ఆర్థిక కార్యదర్శిగా, రెవెన్యూ కార్యదర్శిగా పనిచేశారు. ఎయిరిండియా ప్రైవేటీకరణలో పాండే కీలక పాత్ర పోషించారు. తుహిన్ కాంత పాండేకు ఫైనాన్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో విస్తృత అనుభవం ఉంది. రానున్న మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు.

ఇక ఇప్పటి వరకూ సెబీకి చీఫ్‌గా వ్యవహరించిన మాధాబీ పూరీ బుచ్‌ను కేంద్రం 2022 ఫిబ్రవరి 28న నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె అదే ఏడాది మార్చి 2వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సెబీకి ఓ మహిళ చైర్మన్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. మాధవి గతంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ హెడ్‌గా సేవలందించారు. 2017 నుంచి 2021 మధ్య కాలంలో సెబీ పూర్తి స్థాయి మెంబర్‌గా పని చేశారు. సెబీ చీఫ్‌గా ఆమె పదవీ కాలం నేటితో ముగియనుంది.

## యూపీఐ లావాదేవీల్లో ఎన్నడూ లేనంత జోరు..




**న్యూఢిల్లీ:** జనవరిలో యూపీఐ లావాదేవీలు 16.99 బిలియన్లను అధిగమించాయని, వీటి విలువ రూ.23.48 లక్షల కోట్లను అధిగమించిందని ఇటీవల ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. గతంలో కంటే భిన్నంగా జనవరి 2025లో లావాదేవీలు నమోదయ్యాయని పేర్కొంది. 2023-24 సంవత్సరం యూపీఐ లావాదేవీలు నెలనెలకూ మెరుగుపడుతున్నాయని వివరించింది. భారతదేశ డిజిటల్ చెల్లింపు వ్యవస్థకు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) మూలస్తంభంగా ఉంది. దేశవ్యాప్తంగా 80 శాతం రిటైల్ చెల్లింపులు యూపీఐ ద్వారా జరుగుతున్నాయంటే యూపీఐ క్రేజ్‌ను అర్థం చేసుకోవచ్చు.

2023-24 సంవత్సరానికి మొత్తం యూపీఐ లావాదేవీల పరిమాణం 131 బిలియన్లను దాటింది. అలాగే వీటి విలువ రూ.200 లక్షల కోట్లను దాటింది. యూపీఐ వాడుకలో సౌలభ్యం, భాగస్వామ్య బ్యాంకులు, ఫిన్‌టెక్ ప్లాట్‌ఫారమ్‌ల పెరుగుతున్న నెట్‌వర్క్‌తో కలిపి దేశవ్యాప్తంగా మిలియన్ల మంది వినియోగదారులు యూపీఐను రియల్-టైమ్ చెల్లింపులకు సంబంధించిన ప్రాధాన్యత మోడ్‌గా మార్చిందని నిపుణులు చెబుతున్నారు. జనవరి 2025 నాటికి 80కి పైగా యూపీఐ యాప్‌లు, 641 బ్యాంకుల ద్వారా ఈ స్థాయి యూపీఐ లావాదేవీలు సాధ్యమయ్యాయని వివరిస్తున్నారు.

2025 జనవరి వరకు మొత్తం యూపీఐ లావాదేవీల్లో పీపుల్ టు మర్చంట్ (పీ2ఎం) లావాదేవీలు 62.35 శాతం ఉన్నాయి. అలాగే పీ2పీ లావాదేవీలు 37.65 శాతం ఉన్నాయని ఆర్థిక శాఖ తెలిపింది. 2025 జనవరిలో పీ2ఎం లావాదేవీల సంఖ్య 62.35 శాతానికి చేరుకుంటే ఈ లావాదేవీల్లో 86 శాతం రూ. 500 కంటే చిన్న మొత్తాలే ఉన్నాయని తెలిపింది. తక్కువ విలువ చెల్లింపులకు కూడా యూపీఐ పని చేస్తుందనే నమ్మకం ప్రజల్లో కలగడం వల్లే ఈ లావాదేవీలు పెరిగాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# తల్లి కాబోతోన్న కియారా అద్వానీ..
# గుడ్ న్యూస్ చెప్పిన జంట



టాకీస్: కియారా అద్వానీ తాజాగా గుడ్ న్యూస్ చెప్పింది. తాను తల్లిని కాబోతోన్నాను అని చెప్పకనే చెప్పింది. సిద్దార్థ్ మల్హోత్ర, కియారా అద్వానీలు తమకు పండండి బిడ్డ పుట్టబోతోన్నారని చిట్టి సాక్సులను షేర్ చేశారు. ఇక ఇలా గుడ్ న్యూస్ చెప్పారో లేదో.. నెటిజన్లు, సెలెబ్రిటీలు వీరికి కంగ్రాట్స్ చెబుతున్నారు. సమంత, రకుల్, రియా కపూర్, ఇషాన్ కట్టార్, హ్యూమా ఖురేషి వంటి వారు కియారా, సిద్దార్థ్ పోస్టుల మీద స్పందిస్తున్నారు. కియారా అద్వానీ గేమ్ ఛేంజర్ ప్రమోషన్స్‌లో కూడా ఎక్కువగా పాల్గొనలేదు. కారణం ఇదే అయి ఉంటుందని ఇప్పుడు జనాలు అనుకుంటున్నారు. కియారా అద్వానీ గర్భం దాల్చడంతోనే ఎక్కువగా బయటకు రాలేకపోయిందని, అందుకే గేమ్ ఛేంజర్ ప్రమోషన్స్ కోసం హైదరాబాద్‌కు రాలేదన్నట్టుగా కనిపిస్తోంది. కియారా, సిద్దార్థ్‌లకు రెండేళ్ల క్రితం పెళ్లి అయిన సంగతి తెలిసిందే. 2023 ఫిబ్రవరి 7న వీరికి రాజస్థాన్‌లోని కోటలో ఘనంగా వివాహం జరిగింది. పెళ్లైన రెండేళ్లకు ఇలా గుడ్ న్యూస్ ప్రకటించడంతో వారి అభిమానులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కియారా, సిద్దార్థ్ వేసిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం దాల్చినట్టుగా నేరుగా చెప్పకుండా.. ఓ బిడ్డ రాబోతోందంటూ చిట్టి సాక్సుల్ని షేర్ చేశారు. త్వరలోనే రాబోతోన్నారు అంటూ ప్రకటించడంతో కియారా, సిద్దార్థ్‌లకు అంతా కంగ్రాట్స్ చెబుతున్నారు.





# కవ్వించే చూపులతో ముద్దుగుమ్మ 'అమైరా దస్తూర్'

టాకీస్: 'మనసుకు నచ్చింది' సినిమాతో అమైరా దస్తూర్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయింది. ఆ సినిమా నిరాశ పరచడంతో తెలుగులో పెద్దగా ఆఫర్లు రాలేదు. రాజ్ తరుణ్ తో కలిసి రాజుగాడు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అమైరాకి ఆ సినిమా నిరాశను మిగిల్చింది. రాజు గాడు సినిమా తర్వాత తెలుగులో ఈ అమ్మడు పెద్దగా కనిపించలేదు. కానీ హిందీ, తమిళ్ సినిమాల్లో ఈమెకు అడపా దడపా ఆఫర్లు వస్తున్నాయి. హిందీలో ఈ అమ్మడు ప్రస్థానం, జడ్జిమెంటల్ హై క్యా, కోయి జానే నా, జోగి, ఇన్ఫ్లుయెన్సర్ లైఫ్ సినిమాల్లో నటించింది. అవేవి ఈ అమ్మడికి స్టార్‌డంను తెచ్చి పెట్టలేక పోయాయి. గత సంవత్సరం ఫుర్తీలా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఆడకపోవడంతో మళ్లీ ఆఫర్ల కోసం ఈ అమ్మడు ప్రయత్నాలు చేయాల్సిన పరిస్థితి. అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అయిన బంబై మేరీ జాన్ సిరీస్‌లో ఈమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ తర్వాత ఒకటి రెండు వెబ్ సిరీస్‌ల్లో ఆఫర్లు వచ్చినా వాటికి అమైరా ఓకే చెప్పలేదు. హీరోయిన్‌గా మాత్రమే సినిమాను చేయాలని ఈ అమ్మడు ఆశ పడింది. కానీ హీరోయిన్‌గా ఈ అమ్మడికి ఆఫర్లు దక్కడం లేదు. కానీ సోషల్ మీడియా ద్వారా ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో స్టార్ హీరోయిన్స్ రేంజ్‌లో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసే అమైరా దస్తూర్ కి దాదాపుగా 3.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. వెండి తెరపై అందాల ఆరబోత చేసే అవకాశం దక్కక పోయినా ఇలా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తన అందాల ఆరబోత ఫోటోలను అమైరా దస్తూర్ రెగ్యులర్‌గా షేర్ చేస్తూనే ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు ఈ ఫోటోలతో కన్నుల విందు చేసింది. కవ్వించే విధంగా చూస్తూ ముద్దుగుమ్మ చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ స్థాయి అందం ఉన్నా సినిమాల్లో అమైరాకి రావాల్సిన ఆఫర్లు రాలేదు, దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గతంలో స్పెషల్ సాంగ్‌లో నటించిన అమైరా దస్తూర్ మరోసారి అలాంటి ప్రత్యేక ...లకు, ప్రత్యే... పాత్రలకు ఓకే చెబుతోంది. ఆకట్టుకునే అందం, మంచి ఫిజిక్ ఉండటంతో పాటు నటిగా మంచి ప్రతిభ ఉన్న అమైరా దస్తూర్ ముందు ముందు అయినా సినిమాల్లో మంచి ఆఫర్లు దక్కించుకుంటుందేమో చూడాలి. హీరోయిన్‌గానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ అమైరా దస్తూర్ నటించేందుకు ఓకే చెబుతుంది. కనుక బాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు ముందు ముందు బిజీ అయ్యేనా చూడాలి.

## ఎస్ఎస్ఎంబీ-29లో
# మహేష్ న్యూలుక్

**టాకీస్:** టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. ఎస్ఎస్ఎంబీ29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇక ఈ సినిమా అప్‌డేట్‌ల కోసం అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మహేశ్ కొత్త లుక్‌కి సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాజమౌళితో పాటు ఈ సినిమా కోసం మహేశ్ కూడా బాగా



కష్టపడుతున్నారు. ఇప్పటికే జుట్టు గడ్డం పెంచేసి లుక్స్ మొత్తం మార్చేసిన మహేశ్ తాజాగా జిమ్‌లో వర్కౌట్స్? చేస్తున్నాడు. అయితే మహేశ్ జిమ్‌లో ఎక్సర్‌సైజ్ అనంతరం అద్దం ముందుకు వెళ్లి తన లుక్‌ని చూసుకుని బయటకు వెళ్లే వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో జుట్టు మొత్తం వదిలేసి రగ్గడ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. దీంతో ఈ వీడియో ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్?లోకి దూసుకెళ్లింది. ఇక వీడియో చూసిన అభిమానులు బాబు కొత్త లుక్ అదుర్స్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అడ్వెంచర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే కథతో వస్తుండగా.. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుంది.

## వాణిజ్య ప్రకటనలు తెచ్చిన కష్టాలు
### కాజల్, తమన్నాలను విచారించనున్న పోలీసులు





**టాకీస్:** కాసులకు ఆశపడి స్టార్స్ చేసే కొన్ని ప్రకటనలు వారికి ఊహించని కష్టాలను కొని తెచ్చిపెడతాయి. ఇప్పటికే పలువురు హీరోలు, హీరోయిన్లు, క్యారెక్టర్ ఆర్టిస్టులు కూడా ఇలాంటి సమస్యలలో చిక్కుకున్నారు. తాము ప్రచారం చేసే ప్రాడక్ట్‌తో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో ముందు ఊహించుకోకుండా వీరు ఆయా ప్రకటనల్లో పాల్గొనడమే ఇందుకు కారణం. నిజానికి బ్రాండ్ అంబాసిడర్ గా అంగీకార పత్రాన్ని సమర్పించేప్పుడే ఆ ప్రాడక్ట్ లేదా ప్రాజెక్ట్ వల్ల వినియోగదారులు నష్టపోతే తమకు సంబంధం లేదనే క్లాజ్ ను చేర్చికానీ కొందరు సైన్ చేయడం లేదు. కానీ అంతలోతుగా వివరాలను అధ్యయనం చేయకుండా చాలామంది హీరోయిన్లు రెమ్యూనరేషన్ కు ప్రాధాన్యం ఇచ్చి... వాణిజ్య ప్రకటనలు చేసేసి ఆపైన ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా ఆ జాబితాలోకి కాజల్ అగర్వాల్, తమన్నా భాటియా పేర్లు కూడా చేరాయి. పుదుచ్చేరికి చెందిన ఓ సంస్థ క్రిప్టో కరెన్సీ లో పెట్టుబడులు పెడితే అధిక లాభం పొందవచ్చంటూ కొందరిని తన బుట్టలో వేసుకుంది. దాదాపు పదిమంది ఈ సంస్థలో 2.40 కోట్లను మదుపు చేశారు. అయితే ఆ తర్వాత తాము మోసపోయామంటూ ఘొల్లుమంటున్నారు.

# టాలీవుడ్‌లోకి బాలీవుడ్ దర్శకుడు ఎంట్రీ




**టాకీస్:** అడివిశేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం డెకాయిట్. ఈ సినిమాకు షానీల్ డియో కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. లవ్ రివేంజ్ డ్రామగా రాబోతున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ తాజాగా ఒక అప్‌డేట్ పంచుకున్నారు. ఈ సినిమాతో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా అనురాగ్ కశ్యప్ ఫస్ట్ లుక్ విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ గమనిస్తే.. అనురాగ్ ఇందులో స్వామిమాల ధరించిన పోలీస్ పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. తెలుగుతో పాటు హిందీలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో అడివిశేష్ , మృణాల్ ఠాకూర్ మొదట ప్రేమికులుగా ఆ తర్వాత బద్ధ శత్రువులుగా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.

# బన్నీతో దిల్‌రాజ్ సినిమా

టాకీస్: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో విడదీయరాని బంధం ఉంది. తొలి చిత్రం 'గంగోత్రి' తర్వాత అల్లు అర్జున్ తో 'ఆర్య' మూవీని నిర్మించి మంచి విజయాన్ని కట్టబెట్టాడు దిల్ రాజు. ఆ తర్వాత దిల్ రాజు బ్యానర్ లో 'పరుగు, ఎవడు, డి.జె. దువ్వాడ జగన్నాథమ్' చిత్రాలను బన్నీ చేశాడు. అప్పట్లోనే అల్లు అర్జున్ హీరోగా 'ఐకాన్ : కనబడుట లేదు' అనే సినిమా నిర్మించబోతున్నట్టు దిల్ రాజు ప్రకటించాడు. దానిని శ్రీరామ్ వేణు డైరెక్ట్ చేస్తారనీ అన్నారు. కానీ ఎందుకో అది మాత్రం పట్టాలెక్కలేదు. ఇటీవల విడుదలైన 'పుష్ప-2'తో బన్నీ ఇమేజ్ అమాంతంగా పెరిగిపోయింది. ఈ సినిమా వరల్డ్ వైడ్ రూ. 1871 కోట్ల గ్రాస్ ను వసూలు చేసింది. అల్లు అర్జున్ తదుపరి చిత్రాలపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే... తాజాగా అల్లు అర్జున్... దిల్ రాజు బ్యానర్ లో సినిమా చేయడానికి పచ్చజెండా ఊపాడని తెలుస్తోంది.



# సిద్ధార్థకు నాకు అస్సలు పడదు : థమన్

**టాకీస్:** 'బాయ్స్' సినిమా టైంలో తనకు నటుడి సిద్ధార్థ్‌కి అసలు పడకపోయేదని సంగీత దర్శకుడు థమన్ వెల్లడించాడు. ఆది పినిశెట్టి కథానాయకుడిగా వస్తున్న తాజా చిత్రం శబ్దం. ఈ సినిమాకి అరివళగన్ దర్శకత్వం వహిస్తుండగా.. థమన్ సంగీతం అందించాడు. వైశాలి సినిమాతో థమన్ సంగీత దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు ఇదే కాంబోలో శబ్దం సినిమా వస్తుంది. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు రాగా.. రీసెంట్‌గా ఈ మూవీ ప్రమోషన్స్‌లో పాల్గోన్న థమన్ నటుడు సిద్ధార్థ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. థమన్ మాట్లాడుతూ.. ఈ సినిమా దర్శకుడు అరివళగన్ నాకు బాయ్స్ సినిమా అప్పటినుంచి తెలుసు. దర్శకుడు శంకర్ సార్ నన్ను చూసుకోమని అరివళగన్‌కి అప్పగించాడు. దీంతో మేమిద్దరం అప్పటినుంచి ఫ్రెండ్స్ అయ్యాం. అయితే ఈ సినిమా టైంలో నాకు సిద్ధార్థ్ గాడికి నాకు అసలు పడేది కాదు. వాడికంటే నేనే అప్పుడు ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకున్న. దీంతో ఒకసారి నా దగ్గరికి సిద్ధార్థ్ వచ్చి నేను హీరో అన్నాడు. అయితే ఏంటి నేను ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటున్నా అనేవాడిని. అంతేగాకుండా.. సిద్ధార్థ్ కారవాన్‌లో ఉన్నప్పుడు కరెంటు ఆపేవాడిని. నీళ్ల పైప్ కట్ చేసే వాడిని అంటూ చెప్పుకోచ్చాడు.





Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.